Follow: @ANNTELUGU


ANN తెలుగు

29-11-2024

# మహా పత్రిక

శుక్రవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 315 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/9316 WWW.EPAPER.MAHAADAILY.COM



## కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా జీవన్ రెడ్డి

**సీనియర్ నేత వైపే అందరి మొగ్గు**

- కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల ఏకగ్రీవ తీర్మానం
- హైకమాండ్‌కు పంపాలని నిర్ణయం
- టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ ఆధ్వర్యంలో సమావేశం
- రెండు, మూడురోజుల్లో అధికారిక ప్రకటన వచ్చేఅవకాశం

02

## అబద్ధాల సీఎం

**ఆక్రమణల చరిత్ర నాకు లేదు**

- ఎక్కడికైనా చర్చకు సిద్ధం
- హైడ్రా కూల్చిన ఇళ్ళకు నష్టపరిహారం ఇవ్వాలి
- మాజీ మంత్రి హరీష్‌రావు

02





## ఇందిర లుక్‌లో ప్రియాంక గాంధీ

**కేరళ సంప్రదాయ.. క్రీమ్ కలర్ చీరను ధరించి..**

- రాజ్యాంగం ప్రతిని పట్టుకుని హిందీలో ప్రమాణం
- ప్రమాణ స్వీకారం అనంతరం కేంద్రమంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, నితిన్ గడ్కరీలకు అభివాదం

వివరాలు 2లో




మసాల జోడించేందుకు మీరు

## ఎల్లప్పుడు సిద్ధం

**ఆసీస్ ప్రధానితో విరాట్ ఆసక్తికర వ్యాఖ్యలు**

రెండో టెస్ట్ మ్యాచ్ కి ముందు భారత జట్టు ప్రైమ్ మినిస్టర్స్ ఎలెవెన్ తో రెండు రోజుల మ్యాచ్ ఆడేందుకు కాన్ బెర్రాలో దిగింది. ఈ సందర్భంగా పార్లమెంట్ హౌజ్ లో ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోని ఆల్బనీస్ జట్టును కలిసి ఫోటోలు దిగాడు. విరాట్‌ను పలకరిస్తూ పెర్త్ లో అద్భుతం జరిగింది. ఆసమయంలో మావాళ్లు పెద్దగా బాధ పడినట్టు లేదు. అన్నాడు. వెంటనే విరాట్ `మీరు మసాలా జోడించేందుకు ఎప్పుడూ సిద్ధంగా ఉంటారు `అని నవ్వుతూ రిప్లై ఇచ్చాడు. దానికి ఆయన కూడా నవ్వారు.



ఫుడ్ పాయిజన్‌పై

# సర్కార్ సీరియస్

## ఫుడ్ పాయిజన్.. ఓ కుట్ర

**వరుస ఘటనల వెనుక ప్రణాళిక**

- కుట్రలో.. కొందరు అధికారులు.. వారి వెనుక కొందరు పెద్దలు
- నిగ్గుతేల్చేందుకు సర్కారు స్పెషల్ టాస్క్ ఫోర్స్
- ప్రతీ జిల్లా మంత్రి, కీలక అధికారులకు బాధ్యతలు
- మండల స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు సేఫ్టీ కమిటీలు.. తనిఖీలు
- తాజా ఘటనలపై సీఎం గరం..గరం
- దారకులపై కేసులు నమోదుచేసి జైలుకు పంపండి

"*ఫుడ్ పాయిజనింగ్ పై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్ గా ఉంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరుసఘటనలపై ఫైర్ అయ్యారు. జిల్లా కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడంతో పాటు బాధ్యులపై వేటు వేయాలని, మళ్ళీ రిపీట్ కాకుండా చూడాలని ఆదేశించారు. మరోవైపు రాష్ట్రంలోని గురుకులాలు, హాస్టళ్లలో ఇటీవల వరుసగా వెలుగుచూస్తున్న ఫుడ్ పాయిజన్ ఘటనల నేపథ్యంలో కారణాలు తేల్చేందుకు ప్రత్యేక టాస్క్ ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేశారు. ఒకదాని తర్వాత మరొకటిగా జరుగుతున్న ఈ సంఘటలన వెనుక కుట్రకోణం ఉందన్న అనుమానాన్ని ప్రభుత్వవర్గాలు వ్యక్తం చేస్తున్నాయి. కుట్ర నిగ్గుతేల్చేందుకు ప్రభుత్వం డిసైడైంది. కొందరు అధికారులు, వారి వెనుక కొందరు కుట్రదారులు ఉన్నట్లు అనుమానిస్తున్నారు. ఓ వైపు టాస్క్ ఫోర్స్, మరోవైపు విద్యాకమిషన్ ను కూడా రంగంలోకి దింపింది.*


వివరాలు 2లో

ఎవరున్నా వదలం..

## త్వరలో తేలుస్తాం

**అధికారులుంటే నిర్ధాక్షిణ్యంగా విధుల్లోంచి తొలగిస్తాం**

**మంత్రి సీతక్క సంచలన వ్యాఖ్యలు**



**మహా, హైదరాబాద్:** పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో జరుగుతున్న ఫుడ్ పాయిజన్ ఘటనల వెనుక భారీ కుట్ర దాగి ఉందని అన్నారు. గురువారం మంత్రి మీడియాతో మాట్లాడారు. ఇటీవల తెలంగాణలోని పలు గిరిజన హాస్టళ్లు, మిడ్ డే మిల్స్‌లో ఫుడ్ పాయిజన్ ఘటనలు చోటుచేసుకుంటున్న సంగతి తెలిసిందే. పలువురు విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. తాజాగా, ఈ ఘటనలపై మంత్రి సీతక్క సంచలన వ్యాఖ్యలు చేశారు. ఫుడ్ పాయిజన్ వెనక కుట్ర ఉందని షాకింగ్ కామెంట్స్ చేశారు. కుట్ర వెనక ఎవరున్నా వదలేది లేదని హెచ్చరించారు. ఆ కుట్రలు ఎవరు చేశారనే విషయాన్ని త్వరలోనే బయటపెడతామని అన్నారు. ఒకవేళ కుట్రదారుల వెనుక అధికారులుంటే వారిని ఉద్యోగం నుంచి నిర్ధాక్షిణ్యంగా తొలగిస్తామని వార్నింగ్ ఇచ్చారు.

మిగతా 2లో

## 10వ తరగతి పరీక్షల్లో మార్పులు

- గ్రేడింగ్ సిస్టమ్ ఎత్తివేత
- ఉత్తర్వులు జారీ చేసిన విద్యాశాఖ

**హైదరాబాద్, మహా:** తెలంగాణ విద్యాశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. పదో తరగతి పరీక్షల్లో మార్పులు చేపట్టింది. దీంతో ఇక నుంచి 100 మార్కుల పేపర్ ఉండనుంది. 202425 విద్యా సంవత్సరం నుంచి ఇంటర్నల్ మార్కులను ఎత్తివేస్తూ విద్యాశాఖ తాజాగా నిర్ణయం తీసుకుంది. అయితే, ఇప్పటివరకు 80 మార్కులకే పేపర్ ఉండేది. మిగతా 20 మార్కులతో ఇంటర్నల్ ఎగ్జామ్ నిర్వహించేవారు. ఈ పద్ధతిని ఎత్తివేయాలని విద్యాశాఖ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఉత్తర్వులను జారీ చేసింది. ఇంటర్నల్ మార్కుల్లో అక్రమాలు జరుగుతున్నాయనే ఫిర్యాదులు రావడంతో గ్రేడింగ్ సిస్టమ్ ను ఎత్తివేస్తూ విద్యాశాఖ నిర్ణయం తీసుకుంది.

### స్టాక్ మార్కెట్

| | |
|---|---|
| సెన్సెక్స్ ↗ | 80,234.08 |
| నిఫ్టీ ↗ | 24,274.90 |

### ఈరోజు చికెన్ ధరలు

| | చికెన్ | స్కిన్ లెస్ | బోన్ లెస్ |
|---|---|---|---|
| 1 కేజీ రిటైల్ ధర ₹ | 190 | 230 | 250 |
| హోల్ సేల్ ధర ₹ | 170 | 210 | 220 |

### ఈరోజు గుడ్డు ధరలు

| | 1 పీస్ ₹ | ట్రే |
|---|---|---|
| ఎన్ఈసీసీ గుడ్డు ధర | 5.90 | 177 |
| హోల్ సేల్ గుడ్డు ధర | 5.90 | 177 |
| రిటైల్ గుడ్డు ధర | 6.25 | 187.62 |

భారత రాజ్యాంగంపై

## బీజేపీ బుల్డోజర్

***దళితులు, గిరిజనుల హక్కులు కాలరాస్తోంది***

- కేంద్రం సంపదను అదానీ, అంబానీలకు దోచిపెడుతోంది
- రాజ్యసభ మాజీ సభ్యురాలు బృందాకారత్ ధ్వజం
- ఆదిలాబాద్ లో సీఐటీయూ కార్యాలయం ప్రారంభం



**ఆదిలాబాద్ మహా :** భారత రాజ్యాంగంపై బీజేపీ ప్రభుత్వం బుల్డోజర్ ను ప్రయోగిస్తోందని..పలు మార్లు సవరణలు చేస్తూ దళితులు, గిరిజనుల హక్కులను కాలరాస్తోందని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యురాలు బృందా కరత్ కేంద్రం తీరును దుయ్యబట్టారు.ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని విద్యానగర్‌లో నూతనంగా నిర్మించిన బాశెట్టి మాధవరావు విజ్ఞాన కేంద్రం, సీఐటీయూ జిల్లా కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

మిగతా 2లో

## మోగనున్న పంచాయతీ నగారా

- సంక్రాంతికి నోటిఫికేషన్.. మూడు దశల్లో ఎన్నికలు
- ఇద్దరి కంటే ఎక్కువ పిల్లల నిబంధన ఎత్తివేత
- సర్పంచ్ తర్వాత ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు
- ప్రతీ మండలంలో కనీసం ఐదు ఎంపీటీసీ స్థానాలు
- రాష్ట్ర ప్రభుత్వ కసరత్తు




వివరాలు 3లో

## కేటీఆర్, హరీశ్‌రావును పిచ్చికుక్కలు కరిచినట్టున్నయ్!

- పదేళ్లు రాష్ట్రాన్ని ఇష్టారీతినా దోచుకున్నారు
- మీ అవినీతిలో భాగం కావొద్దని బయటకొచ్చా
- స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**హైదరాబాద్, మహా:** మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావులపై స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి గతంలో ఎన్నడూ లేని విధంగా తీవ్ర స్థాయిలో ఫైరయ్యారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. కేటీఆర్, హరీశ్‌రావును పిచ్చికుక్కలు కరిచినట్లు

మిగతా 2లో

## కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ

**తెలంగాణకు కేంద్రం గుడ్ న్యూస్**

**హైదరాబాద్, మహా:** తెలంగాణకు రైల్వేశాఖ గుడ్న్యూస్ చెప్పింది. రాష్ట్ర విభజన హామీలలో మరో హామీని కేంద్రం నెరవేర్చింది. కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయనుంది. ప్రస్తుతం అక్కడ ఉన్నటువంటి ఓవర్‌హాలింగ్ వర్క్‌షాప్‌ను మాన్యుఫాక్చరింగ్ యూనిట్‌గా అప్‌గ్రేడ్ చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. అప్‌గ్రేడ్ చేయాలని 2023 జులై 5న ద.మ రైల్వే జీఎంకి రైల్వే బోర్డు లెటర్ రాసింది. అప్‌గ్రేడ్ చేసినటువంటి యూనిట్‌లో ఎల్‌హెచ్‌బీ, ఈఎంయూ కోచ్‌లు తయారు చేసేందుకు వీలుగా యూనిట్‌ని అభివృద్ధి చేయాలని ఈ ఏడాది సెప్టెంబరు 9న రైల్వే బోర్డు ఆదేశాలు జారీచేసింది. కాజీపేట రైల్వే మాన్యుఫాక్చరింగ్ యూనిట్‌లో ఎల్‌హెచ్‌బీ, ఈఎంయూ కోచ్‌ల తయారీకి సౌకర్యాలను అభివృద్ధి చేయడానికి ప్లాన్ను రూపొందించాలని ఈ మేరకు రైల్వే బోర్డు సూచించింది. విభజన హామీల అమలుపై తెలంగాణ రాష్ట్ర అధికారులు, కేంద్ర అధికారులతో హోం శాఖ నిర్వహించిన భేటీలో ఈ విషయం వెల్లడైంది.

## కొండా సురేఖకు బిగ్ షాక్

- కేసు నమోదు చేయాలని నాంపల్లి కోర్టు ఆదేశాలు
- డిసెంబర్ 12న వ్యక్తిగతంగా హాజరుకావాలని సమన్లు



03

## ఖమ్మంలో జంట హత్యలు

**దండుపాళ్యం మూవీ సీన్ రిపీట్**

ఇల్లు అద్దెకు కావాలని వచ్చి, భోజనం చేసి దంపతులను హత్య చేసి దోపిడీకి పాల్పడ్డ దొంగలు

వివరాలు 2లో

# ఇందిర లుక్‌లో ప్రియాంక గాంధీ




**ఢిల్లీ, మహా:** ఇందిరమ్మను గుర్తు తెచ్చేలా ప్రియాంకగాంధీ తొలిసారి లోక్ సభలో అడుగు పెట్టినపుడు ప్రత్యేకంగా కనిపించారు. కేరళ కాటన్ జారీ చీర ధరించి కట్టుబొట్టుతో అక్కడి సంస్కృతి ప్రతిభించేలా ప్రియాంక లోక్‌సభకు హాజరయ్యారు. తొలిసారి లోక్‌సభకు ఎన్నికైన ప్రియాంక గాంధీ వాద్రా గురువారం ఎంపీగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ప్రియాంక కుటుంబం అంతా కూడా పార్లమెంటు హౌజ్‌లోనే ఉన్నారు. తల్లి సోనియా గాంధీ, సోదరుడు రాహుల్ గాంధీతో పాటు భర్త రాబర్ట్ వాద్రా, ఆమె కుమారుడు రెహాన్ వాద్రా, కుమార్తె మిరాయా వాద్రా కూడా పార్లమెంట్ హౌస్‌లో ఉన్నారు.

కేరళ సాంప్రదాయాన్ని అనుసరించి క్రీమ్ కలర్ చీర కట్టుకున్న ప్రియాంక గాంధీ పార్లమెంటు హౌస్‌కి చేరుకున్నారు. ప్రియాంక కేరళ కాటన్ జారీ చీర ధరించి కట్టుబొట్టుతో అక్కడి సంస్కృతి ప్రతిభించేలా లోక్‌సభకు హాజరయ్యారు. ఉదయం 11 గంటలకు లోక్‌సభ కార్యకలాపాలు ప్రారంభమైన తర్వాత ఎంపీగా ప్రమాణం చేశారు. ప్రమాణ స్వీకారోత్సవం సందర్భంగా, ప్రియాంక తన చేతిలో రాజ్యాంగ ప్రతిని పట్టుకుని, దానిని గాలిలో చూపుతూ.. హిందీలో ప్రమాణ స్వీకారం చేశారు. ప్రమాణ స్వీకారం అనంతరం ప్రియాంక లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు ముకుళిత హస్తాలతో అభివాదం చేశారు. అనంతరం మొదటి వరుసలో కూర్చున్న ప్రతిపక్ష నేతలకు ప్రియాంక అభివాదం చేశారు. సభలో ప్రతిపక్ష నేత, ఆయన సోదరుడు రాహుల్ గాంధీ శుభాకాంక్షలు తెలిపారు. ప్రమాణస్వీకారం చేసిన తర్వాత ప్రియాంక ప్రతిపక్ష ఎంపీలకు ఉన్న నాలుగో వరుస సీట్లలో కూర్చున్నారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మొదటి వరుసలో కూర్చున్నారు. ప్రియాంక లోక్‌సభలోకి అడుగుపెట్టగానే కాంగ్రెస్ ఎంపీలు శుభాకాంక్షలు తెలిపారు. ఆమెను చుట్టుముట్టి ఫోటోలు, సెల్ఫీలు దిగారు. కాగా, మిసా భారతి, దీపేందర్ హుడా, శశిథరూర్ సహా పలువురు ఎంపీలు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రమాణ స్వీకారం అనంతరం రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, నితిన్ గడ్కరీలకు అభివాదం చేసిన ప్రియాంక, గ్యాలరీలో కూర్చున్న సోనియా గాంధీని, ఆమె అత్తగారిని కూడా పలకరించారు. ప్రియాంకతో పాటు మహారాష్ట్రలోని నాందేడ్ లోక్‌సభ స్థానం నుంచి ఎన్నికైన కాంగ్రెస్ నేత రవీంద్ర బసంత్రావ్ చవాన్ కూడా ఈరోజు పార్లమెంటు సభ్యులుగా ప్రమాణం చేశారు. చవాన్ మరాఠీ భాషలో ప్రమాణం చేశారు.

## కేటీఆర్, హరీశ్‌రావును పిచ్చికుక్కలు కరిచినట్టున్నయ్!

(మొదటిపేజీ తరువాయి)

తనకు అనుమానం కలుగుతుందన్నారు. వారిని చూస్తుంటే రోజూ మీడియాలో ఉండాలనే తపన తప్ప మరేం కనిపించడం లేదన్నారు. కేటీఆర్‌కు జైలు భయం పట్టుకుందన్నారు. కేసీఆర్, కేటీఆర్ తప్పులు ఒక్కొక్కటిగా బయపడుతున్నాయని కడియం పేర్కొన్నారు. 'పదేళ్లు రాష్ట్రాన్ని దోచుకున్నారు. వనరులను కొల్లగొట్టి వేల ఎకరాలు కబ్జా చేశారు. ఫామ్ హౌస్‌లు, ప్యాలెస్‌లు నిర్మించుకున్నారు. మీ అవినీతిలో భాగస్వామి కావొద్దనే బీఆర్ఎస్ నుంచి బయటకువచ్చా' అంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ఫుడ్ పాయిజన్‌పై సర్కార్ సీరియస్

(మొదటిపేజీ తరువాయి)

ఫుడ్ పాయిజన్ ఘటనల వెనుక ఓ రాజకీయ పార్టీ ఉందని తమకు అనుమానంగా ఉందని తెలిపారు.

**ఇథనాల్ ఫ్యాక్టరీ తలసానిదే..**

ఆనాడు దిలావర్పూర్‌లో ఇథనాల్ ఫ్యాక్టరీకి అనుమతులు ఇచ్చింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని మంత్రి ఫైర్ అయ్యారు. అక్కడి ప్రజల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకుండా ఫ్యాక్టరీ ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేశారని గుర్తు చేశారు. నేడు మళ్లీ కేటీఆర్ తమపై నిస్సిగ్గుగా మాపై నిందలు వేస్తున్నారని ధ్వజమెత్తారు. కంపెనీ డైరెక్టర్‌గా తలసాని సాయికిరణ్ ఉన్నాడని ఆరోపించారు. కేటీఆర్ కు చిత్తశుద్ధి ఉంటే దిలావర్పూర్ కు వచ్చి అనుమతులు ఇచ్చింది తనేనని ఒప్పుకోవాలని అన్నారు. అసెంబ్లీ లోనూ ఇథనాల్ కంపెనీ పై చర్చ పెడతామని.. కేటీఆర్ ఇచ్చిన అనుమతులను బయటపెడతామని మంత్రి సీతక్క అన్నారు.

# పట్నంకు హైకోర్టు షాక్

**హైదరాబాద్, మహా:** లగచర్ల దాడి కేసులో పట్నం నరేందర్ రెడ్డికి తెలంగాణ హైకోర్టు బిగ్ షాక్ ఇచ్చింది, ఆయన రిమాండ్‌ను మరోసారి పొడిగించింది. నిన్నటితో 14రోజుల జ్యూడిషియల్ రిమాండ్ ముగిసిన విషయం తెలిసిందే. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కోర్టులో పోలీసులు హాజరు పరిచారు. వచ్చే నెల 11వరకు రిమాండ్ పొడిగించింది. బెయిల్ పిటీషన్‌పై వికారాబాద్ కోర్టులో వాదనలు కొనసాగాయి. కస్టడీపై ఇప్పటికే వాదనలు ముగిశాయి. క్వాష్ పిటిషన్‌పై హైకోర్టు తీర్పు రిజర్వు చేసింది. లగచర్లలో వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌పై దాడి ఘటన తెలంగాణ వ్యాప్తంగా తీవ్ర కలకలం రేపుతోంది. ఓవైపు బీఆర్ఎస్ పార్టీ నేతల హస్తం ఈ దాడి వెనుక ఉందనే ఆరోపణలు వినిపిస్తుండగా, తమపై కాంగ్రెస్ కుట్ర పన్నుతోందని గులాబీ పార్టీ నేతలు ఆరోపిస్తున్నారు. దాడిలో పాల్గొన్న నిందితుల్లో కొడంగల్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత పట్నం నరేందర్‌రెడ్డితో ఎక్కువసార్లు ఫోన్‌లో మాట్లాడినట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసులో మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం చర్లపల్లి జైల్లో నరేందర్ రెడ్డి ఉన్నారు. అయితే పట్నం నరేందర్ రెడ్డి క్వాష్ పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. రీమాండ్‌ను కొట్టివేయాలని నరేందర్ రెడ్డి క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు.



**89 సార్లు ఫోన్‌కాల్స్**


లగచర్లలో భూసేకరణకు సంబంధించిన విచారణకు వెళ్లిన వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్, ఇతర అధికారులపై దాడికి పాల్పడిన ఘటనలో ఏ1గా ఉన్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి కీలక కుట్రదారుడని పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వర్‌రావు చెప్పారు. ఏ2గా ఉన్న సురేశ్, ఇతర నిందితులకు ఆర్థికంగా, నైతికంగా సహకరించారన్నారు. సురేశ్‌తో దాదాపు 89 సార్లు ఫోన్‌కాల్స్ మాట్లాడారంటే కుట్రలో నరేందర్‌రెడ్డి పాత్ర ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. పిటిషనర్ ప్రోత్సాహంతోనే నిందితులు కలెక్టర్ సహా ఇతర అధికారులను హత్య చేయాలనే కుట్రతో దాడికి తెగబడ్డారని తెలిపారు. ఈ కేసులో కొడంగల్ కోర్టు జారీచేసిన రిమాండ్ ఉత్తర్వులను కొట్టేయాలంటూ పట్నం నరేందర్‌రెడ్డి హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్ జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. పోలీసులు, ప్రభుత్వం తరఫున నాగేశ్వర్‌రావు వాదిస్తూ, పిటిషనర్ అరెస్ట్ సందర్భంగా అన్ని నిబంధనలు పాటించామన్నారు. దాడికి కుట్రలో పిటిషనర్ పాత్ర స్పష్టంగా ఉందని, ఇవన్నీ దర్యాప్తులో తేలుతాయని, అప్పటివరకు కోర్టు జోక్యం చేసుకోవద్దని విన్నవించారు. మరోవైపు పిటిషనర్ దిగువ కోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేశారని, పోలీసులు కస్టడీ కోరుతున్నారని.. దిగువ కోర్టులో ఈ పిటిషన్లు విచారణలో ఉన్నాయని తెలిపారు.

**పోలీసులు నిబంధనలు పాటించలేదు..**

పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది గండ్ర మోహన్‌రావు వాదిస్తూ నరేందర్‌రెడ్డి అరెస్ట్ సందర్భంగా పోలీసులు నిబంధనలను పాటించలేదన్నారు. ఆయన ఘటనా స్థలంలో లేరనే విషయాన్ని గుర్తించాలని కోరారు. పార్టీ కార్యకర్తలతో నాయకులు మాట్లాడడం సహజమన్నారు. మొదటి రిమాండ్ కేస్ డైరీలో పిటిషనర్ పేరు లేదు. భూములు కోల్పోతున్న రైతులు ఆవేశానికి గురైతే.. దానికి ప్రభుత్వాన్ని అస్థిరపర్చాలనే కుట్ర, హత్య చేయాలనే ఉద్దేశంతో దాడి వంటి తీవ్ర ఆరోపణలు చేశారు. కేబీఆర్ పార్కులో వాకింగ్ చేస్తుండగా మఫ్టీలో వచ్చిన 12 మంది పోలీసులు పిటిషనర్‌ను ఎత్తుకెళ్లారు. ఒక్క బీఎన్ఎస్ 109 సెక్షన్ తప్ప మిగతావన్నీ ఏడేళ్లలోపు శిక్షపడే సెక్షన్లేనని, రిమాండ్ విధించరనే ఉద్దేశంతోనే 109సెక్షన్ పెట్టారన్నారు. కోర్టులో ప్రవేశపెట్టిన తర్వాతే తనను ఏ1గా చేర్చారని నిందితుడికి తెలిసిందని, పిటిషనర్ ఎలాంటి నేరాంగీకార వాంగ్మూలం ఇవ్వకుండానే ఇచ్చినట్లుగా పోలీసులు సొంతంగా రాసేసుకున్నారన్నారు. తాను ఏ స్టేట్‌మెంట్ ఇవ్వలేదని చర్లపల్లి జైల్లో ఉన్న పిటిషనర్ దిగువ కోర్టులో అఫిడవిట్ సమర్పించారని పేర్కొన్నారు. వాదనలు విన్న ధర్మాసనం పిటిషనర్ ఒక మాజీ ఎమ్మెల్యే ఆయనకు 1+1 సెక్యూరిటీ ఉంటుంది. పార్కులో వాకింగ్ చేస్తుండగా అరెస్ట్ చేయాల్సిన అవసరం ఏంటి? ఆయన ఏమైనా ఉగ్రవాదా? పారిపోతారా? ఇంటికి వెళ్లిన తర్వాత అరెస్ట్ చేసి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వాల్సిందని వ్యాఖ్యానించింది. దీనికి పీపీ సమాధానం ఇస్తూ ఇంటి వద్దే అరెస్ట్ చేశామని, సన్నిహితులకు సమాచారం ఇచ్చామని తెలిపారు. పిటిషనర్ ప్రత్యక్షంగా అక్కడ లేరని, కుట్ర ఆరోపణలే ఉన్నందున రిమాండ్ అవసరమేంటని ధర్మాసనం ప్రశ్నించింది. పిటిషనర్ పాత్రకు సంబంధించిన వివరాలతో పాటు ప్రత్యక్ష సాక్షుల స్టేట్‌మెంట్లు ఇవ్వాలని ఆదేశిస్తూ విచారణను గురువారానికి వాయిదా వేసింది కోర్టు.

# కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా జీవన్ రెడ్డి

**హైదరాబాద్, మహా:** కాంగ్రెస్ పార్టీ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిపై నిర్ణయానికొచ్చింది. కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రస్తుత సిట్టింగ్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డినే నిలపాలని నిర్ణయానికొచ్చింది. రాష్ట్ర వ్యవహారాల ఇన్ ఛార్జి దీపాదాస్ మున్షీ, సిడబ్ల్యుసి సభ్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ల సమక్షంలో జరిగిన నాలుగు జిల్లాల నేతల సమావేశంలో సిట్టింగ్ ఎమ్మెల్సీ అభ్యర్థిత్వంపై ఏకాభిప్రాయం వ్యక్తమైనట్లు తెలిసింది. ఈమేరకు ఏకగ్రీవ తీర్మానం హైకమాండ్ కు పంపాలని నిర్ణయించారు. నాలుగు జిల్లాల పరిధిలో ఉన్న 43 నియోజకవర్గాల నుండి కూడా తీర్మానాలు చేసి.. పంపాలని సమావేశంలో నిర్ణయించినట్లు తెలిసింది. ఈ స్థానం కోసం వెలిచాల రాజేందర్, విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి పోటీపడగా, పార్టీ మాత్రం ఆదినుండీ పార్టీకి విధేయతగా ఉంటున్న అత్యంత సీనియర్ నేత సిట్టింగ్ సీటును మరోసారి ఆయనకే ఇచ్చి గెలిపించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. మంత్రులు దుద్దిల్ల శ్రీధర్ బాబు, కొండా సురేఖ, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ ఆలీ, ఆయా జిల్లాల ఎమ్మెల్యేలు, డిసిసి అధ్యక్షులు ఈ భేటీకి హాజరయ్యారు.




### సీనియర్ నేతవైపే అందరి మొగ్గు

ఉత్తర తెలంగాణలో హస్తం పార్టీ బలోపేతం దిశగా అడుగులు వేస్తోంది. కాంగ్రెస్ పార్టీ మరో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ సీటుపై కన్నేసింది. ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ జిల్లాల పట్టభద్రుల ఎన్నిక అధికార కాంగ్రెస్ పార్టీ కీలకంగా భావిస్తుంది. అందులో భాగంగానే ఆ నాలుగు జిల్లాల ప్రజా ప్రతినిధులతో టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన గెలుపు అవకాశాల మీద గాంధీ భవన్ లో సమావేశమై కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు సమాచారం. ఈ సమావేశంలో నలుగురు మంత్రులు శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీతక్క, కొండా సురేఖ లు.. ఆయా జిల్లాల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, డిసిసి అధ్యక్షులకు పట్టభద్రుల ఎన్నిక కోసం కష్టపడి పని చేయాలని పార్టీ చీఫ్ సూచించారు. మరో సారి జీవన్ రెడ్డి నీ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థిగా నిలుపాలని నాలుగు జిల్లాల ముఖ్య నేతల సమావేశంలో ఏక గ్రీవ తీర్మానం చేశారు. ఈ తీర్మానాన్ని అధిష్టానం కు పంపాలని నిర్ణయించారు. సీనియర్ నేత జీవన్ రెడ్డినే మరోసారి ఎంపికచేయడం అత్యంత వ్యూహాత్మకమని భావిస్తున్నారు.

## భారత రాజ్యాంగంపై బీజేపీ బుల్డోజర్

(మొదటిపేజీ తరువాయి)

సీఐటీయూ, సీపీఎం జిల్లా నేతలతోపాటు అనుబంధ కార్మిక సంఘాల ప్రతినిధులు, కార్మికులు పెద్ద ఎత్తున తరలిరాగా వారి సమక్షంలో ఎంతో సంబురంగా ఈ కార్యాలయాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభోత్సవం చేశారు. అతిథులందరూ కలిసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం స్థానిక ఆర్ అండ్‌బీ అతిథిగృహం వద్ద నిర్వహించిన బహిరంగ సభకు ఆదివాసీ సంప్రదాయ గుస్సాడీ నృత్యాల నడుమ ర్యాలీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా ముఖ్య వక్త బృందాకరత్ సభికులను ఉద్దేశించి ప్రసంగించారు. కార్మికులు రక్తం చిందించి కష్టపడిన సొమ్ముతో విరాళంగా అందించిన డబ్బులతోనే జిల్లాలో ఇవాళ విజ్ఞానకేంద్రం, సీఐటీయూ కార్యాలయం నిర్మాణమైందన్నారు. ఆదివాసీల ఆరాధ్య దైవాలు, పోరాట యోధులు కొమురంభీం, రాంజీగోండు పుట్టిన పురిటిగడ్డకు రావడం ఆనందంగా ఉందన్నారు. వారి పోరాటాల స్ఫూర్తితోనే కార్మికులు, పేదలు, బడుగు బలహీనవర్గాల హక్కుల కోసం ఎర్రజెండా అలుపెరగకుండా ఉద్యమిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ ఆల్ ఇండియా నాయకులు సాయిబాబు, హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి చంద్రకుమార్, సీపీఎం మాజీ పార్లమెంట్ సభ్యులు మిడియం బాబురావు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, సీఐటీయూ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి జయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌తో మేము కలిస్తే నీకీపాటికి చిప్పకూడే..

- నీ పనికిమాలిన స్టేట్మెంట్లు చూస్తుంటే మెదడు కూడా లేదనిపిస్తోంది
- కేటీఆర్‌పై బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు ఫైర్

**మహా, హైదరాబాద్:** కాంగ్రెస్‌తో కలిసి పని చేసి ఉంటే ఈరోజు నువ్వు ఇలా ట్వీట్లు పెట్టకుండా చర్లపల్లి జైల్లో చిప్పకూడు తింటూ ఉండేవాడివి అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు బీజేపీ ఎంపీ రఘునందన్ రావు తీవ్ర స్థాయిలో కౌంటర్ ఇచ్చారు. నీ పనికి మాలిన స్టేట్మెంట్లు చూస్తుంటే నువ్వు కోల్పోయింది అధికారం మాత్రమే కాదని మెదడు కూడా కోల్పోయావని స్పష్టమవుతుందన్నారు. ప్రధాని మోదీతో తెలంగాణ బీజేపీ నేతల భేటీకి సంబంధించి తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడేలా రాష్ట్ర బీజేపీ నేతలంతా 'కలిసికట్టుగా పని చేయండి' అనే శీర్షికలతో ఆయా దినపత్రికలలో వచ్చిన కథనాలకు ఎక్స్ లో షేర్ చేస్తూ కేటీఆర్ పోస్టు చేశారు. 'మోదీ గారు మీ కమలం నేతలు, కాంగ్రెస్ నేతలు కలిసిపోయి మరీ కలిసికట్టుగా పని చేస్తున్నా'రంటూ విమర్శించారు. ఈ వ్యాఖ్యలకు ఎక్స్ వేదికగా రఘునందన్ రావు కౌంటర్ ఇస్తూ కాంగ్రెస్, బీజేపీ కలిసి పనిచేస్తే కేటీఆర్ ఈ పాటికే జైలు పాలు అయ్యేవాడని అన్నారు.



### గత పదేళ్లు రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారు..

గత పదేళ్లు అధికారంలో ఉండి అన్ని శాఖలను, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను, విదా వ్యవస్థను, వైద్య వ్యవస్థను కేటీఆర్ చిన్నాభిన్నాం చేశారని విమర్శించారు. నీలాంటి వాళ్ళ దగ్గర రాజకీయాలు ఎలా చేయాలో ఎప్పుడు చేయాలో నేర్చుకునే దౌర్భాగ్యం మాకు పట్టలేదని మండిపడ్డారు. నీకు రాజకీయాలు ఎలా చేయాలో, ప్రజల సమస్యలు ఎలా నెరవేర్చాలో తెలిసి ఉంటే ఈరోజు అధికారం కోల్పోయి ఉండేవాడివి కాదన్నారు. నిన్ను నమ్మి పార్టీ బాధ్యతలు అప్పగించిన మీ నాయనే ఈరోజు ప్రజలకు ముఖం చూపలేక! ఫాంహౌస్ కు పరిమితమైండు, నీ పనికిమాలిని స్టేట్మెంట్లు చూస్తుంటే నువ్వు కోల్పోయింది అధికారం మాత్రమే కాదు మెదడు కూడా కోల్పోయావని స్పష్టం అవుతుందని ఎద్దేవా చేశారు.

## ఫుడ్ పాయిజన్‌పై సర్కార్ సీరియస్

**హైదరాబాద్, మహా:** రాష్ట్రంలోని గురుకులాలు, హాస్టళ్లలో ఇటీవల వరుసగా వెలుగుచూస్తున్న ఫుడ్ పాయిజన్ ఘటనల నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తమైంది. ఫుడ్ పాయిజన్కు కారణాలు తేల్చేందుకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేసింది. ముగ్గురు సభ్యులు ఉండే ఈ కమిటీలో ఒక ఫుడ్ సేఫ్టీ కమిషనర్, ఓ అదనపు డైరెక్టర్, ఒక జిల్లా స్థాయి అధికారి ఉంటారు. గురుకులాలు, హాస్టళ్లలో ఆహార నాణ్యతను ఈ బృందం పరిశీలించనుంది. వీటితో పాటు అంగన్వాడీలు, ఆసుపత్రుల్లో ఆహార నాణ్యతనూ పర్యవేక్షించనుంది. ఫుడ్ పాయిజన్ జరిగినప్పుడు కారణాలు తేల్చి, బాధ్యులను గుర్తించనుంది. ఈ మేరకు సీఎస్ శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. ఇదే సమయంలో గురుకులాలు, హాస్టళ్లు, అంగన్వాడీల్లో పాఠశాల ఫుడ్ సేఫ్టీ కమిటీలను ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో హెడ్ మాస్టర్, ఇద్దరు పాఠశాల సిబ్బంది సభ్యులుగా ఉంటారు. ఫుడ్ సేఫ్టీ కమిటీ రుచి చూసిన తర్వాతే విద్యార్థులకు భోజనం వడ్డించాలని సర్కార్ ఆదేశించింది. వంట చేసే ముందు కిచెన్ పరిశీలించి పరిశుభ్రత నిర్ధారించాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఫుడ్ సేఫ్టీ కమిటీలు ఏర్పాటు చేయాలని కలెక్టర్లకు సీఎస్ ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల నారాయణపేట జిల్లా మాగనూరు పాఠశాలలో వారం రోజుల వ్యవధిలో విద్యార్థులు 3సార్లు పుజ్ పాయిజన్కు గురయ్యారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంపై దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాలపై హైకోర్టు బుధవారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు అస్వస్థతకు గురి కావడంపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. వారం రోజుల వ్యవధిలో మూడుసార్లు భోజనం వికటించి విద్యార్థులు ఆస్పత్రి పాలవడమేమిటని, ఇలా జరుగుతుంటే సంబంధిత అధికారులు నిద్రపోతున్నారా? అని హైకోర్టు ప్రశ్నించింది. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనడానికి ఇది నిదర్శనమని, ఈ విషయంలో ప్రభుత్వం కూడా సీరియస్‌గా తీసుకోవడం లేదని హైకోర్టు వ్యాఖ్యానించింది.

# ఖమ్మంలో జంట హత్యలు

**ఖమ్మం, మహా :** దండుపాళ్యం సినిమాను చాలా మంది చూసే ఉంటారు. ఎవరైనా ఇద్దరు ముగ్గురు కొంచెం అనుమానాస్పదంగా కనిపించినా, కాస్త భయంకరమైన ఆహార్యాలు కంటపడినా వీళ్లేంట్రా దండుపాళ్యం బ్యాచ్‌లా ఉన్నారంటూ సీరియస్‌గానో, సరదాకో అంటుంటారు. అందుకు కారణం ఆ సినిమాలో ఉండే బ్యాచ్ చేసే నేరాలు ఒళ్లు జలదరించేలా ఉండటమే. ఈ సినిమాలో కొంతమంది దుండగులు ఓ బ్యాచ్‌లో ఏర్పడి ఉదయం పూట రెక్కీ నిర్వహించి ఆ ఇంటికి వెళ్లి పని కావాలనో, నీళ్లు కావాలనో అడిగి ఇంటి పరిస్థితులను పరీక్షిస్తారు. తర్వాత అర్ధరాత్రి సమయంలో బ్యాచ్ దిగి ఇంట్లో వాళ్లను చంపేసి డబ్బు, నగలు దొంగతనం చేస్తారు. కొన్ని సందర్భాల్లో చంపేసిన మహిళపై అత్యాచారం చేసి పైశాచిక ఆనందం పొందుతుంటారు. అయితే.. ఖమ్మంలోనూ దండుపాళ్యం సినిమాలోని ఓ క్రైం సీన్ రిపీట్ అయ్యింది. ఈ సంఘటన స్థానికంగా తీవ్ర సంచలనం సృష్టించింది.

ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలో నివసిస్తున్న ఎర్రా వెంకటరమణ (60), కృష్ణ కుమారి (55) దంపతుల ఇంటికి ముగ్గురు వ్యక్తులు అద్దె కోసం వచ్చారు. ఇల్లు అద్దెకు కావాలని అడగటంతో ఖాళీగా ఉన్న ఇంటిని చూపించారు. అది చూసి ఇల్లు నచ్చిందని చెప్పటమే కాకుండా వెంటనే కొంత అడ్వాన్స్ కూడా ఇచ్చారు. సామాన్లు తెచ్చుకుంటామని వెళ్లిపోయి అదే రోజు రాత్రి మళ్లీ వచ్చి ఇంటి యజమానితో మాట కలిపారు. అంతేకాదు ఆ రాత్రి యజమాని ఇంట్లోనే భోజనం కూడా చేశారు. ఆ మరుసటి రోజు అర్ధరాత్రి సమయంలో మళ్లీ వచ్చారు. పథకం ప్రకారం.. ఇంట్లోకి ప్రవేశించగానే వెంకటరమణ, ఆయన భార్య కృష్ణ కుమారి కళ్లల్లో కారం కొట్టి.. అత్యంత దారుణంగా హత్య చేశారు. అనంతరం ఇంట్లో ఉన్న నగదు, బంగారు నగలు దోచుకుని సైలెంట్‌గా ఉడాయించారు. వెళ్లే ముందు తమను పోలీసు కుక్కలు కూడా పసిగట్టకుండా ఉండేదుకు ఇంటి చుట్టూ కారం చల్లి వెళ్లారు.




ఎప్పటిలాగానే వెంకటరమణ కుమార్తె ఫోన్ చేయగా వారి ఫోన్ స్విచ్ ఆఫ్ వస్తోంది. తల్లిదండ్రులిద్దరూ ఫోన్ లిఫ్ట్ చేయక పోవటంతో కంగారు పడి పై పోర్షన్‌లో అద్దెకు ఉంటున్న ఉన్నవారికి ఫోన్ చేసింది. వాళ్లు వెళ్లి చూడటంతో ఇంటికి తాళం వేసి ఉండటమే కాకుండా.. ఇంటి చుట్టూ కారం చల్లి ఉండటాన్ని గమనించారు. పరిస్థితిని ఆమెకు తెలిపారు. దీంతో వెంకట రమణ కుమార్తె వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చింది. హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు తాళం పగలగొట్టి చూడగా ఇంట్లో వెంకటరమణ, కృష్ణ కుమారి మృతదేహాలు కనిపించాయి. హత్య జరిగిన తీరును పరిశీలించిన పోలీసులు ఫింగర్ ప్రింట్స్ టీమ్స్, డాగ్ స్క్వాడ్స్ ద్వారా కేసును దర్యాప్తు చేశారు. అంతేకాకుండా ఆ ప్రాంతంలో ఉన్న అన్ని సీసీ కెమెరాల ఫుటేజ్‌ను కూడా పరిశీలించారు. వెంకట రమణ కుమార్తె ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కాగా.. దండుపాళ్యం సినిమాలో జరిగినట్టుగానే ఈ దారుణ హత్యలు జరగడంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.



## చెరువులపై పూర్తి పర్యవేక్షణ మాదే

### స్పష్టం చేసిన హైకోర్టు

**హైదరాబాద్, మహా :** హైదరాబాద్ లోని చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లను రాష్ట్ర సర్కారు నిర్ధారించే వరకు వాటిపై పూర్తి పర్యవేక్షణ తమదేనని హైకోర్టు స్పష్టం చేసింది. హెచ్ఎండిఏ పరిధిలో 3,532 చెరువులున్నాయని, 2,793 చెరువులకు ప్రైమరీ నోటిఫికేషన్లు, 530 చెరువులకు ఫైనల్ నోటిఫికేషన్లు పూర్తయినట్లు ప్రభుత్వం న్యాయస్థానానికి తెలిపింది. నోటిఫికేషన్ల ఖరారుకు 3 నెలల గడువు కోరింది. కాగా, గడువు ఇచ్చేందుకు నిరాకరించిన కోర్టు డిసెంబర్ 3 0లోగా పూర్తి నివేదిక ఇవ్వాలని ఆదేశించింది.

# అబద్ధాల సీఎం




**హైదరాబాద్, మహా :** అధికారాన్ని అడ్డు పెట్టుకుని అబద్ధాలతో ప్రజలను మభ్యపెట్టి మా చేసేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం కంకణం కట్ ుకున్నట్లు స్పష్టమవుతుందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీష్ రావు మండిపడ్డారు. రాష్ట్ర ప్రజలనే కాదు.. పార్లమెంట్‌ను సైతం సీఎం రేవంత్ రెడ్డి మోసం చేశారని ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో హరీష్‌రావు మీడియాతో మాట్లాడుతూ, మల్లన్నసాగర్‌లో తాను భూములు ఆక్రమిస్తే విచారణ జరిపించాలని, ప్రభుత్వం రేవంత్ చేతిలోనే ఉందన్నారు. మూసీపై సీఎంతో బహిరంగ చర్చకు సిద్ధమని, ఎక్కడకు రావాలో చెప్పాలని సవాల్ విసిరారు. మూసీపై అఖిల పక్షానికి సిద్ధంగా ఉన్నామని, అఖిల పక్షాన్ని చర్చలకు పిలుస్తానన్నముఖ్యమంత్రి తోక ముడిచారని హరీష్‌రావు ఎద్దేవా చేశారు.

**పార్లమెంట్‌ను తప్పుదోవ పట్టించిన రేవంత్ ప్రభుత్వం**

మూసీ రివర్ డెవలప్ మెంట్ ప్రాజెక్టు విషయంలో ప్రభుత్వం వాస్తవాలను దాచిపెడుతోందన్నారు. కేంద్రాన్ని, పార్లమెంట్‌ను రేవంత్ ప్రభుత్వం తప్పుదోవ పట్టించిందని అన్నారు. 2013 భూసేకరణ చట్టాన్ని అమలు చేస్తున్నామని పార్లమెంట్‌కు రాష్ట్ర ప్రభుత్వం చెప్పిందని, రేవంత్‌కు సోనియాగాంధీపై ప్రేమ, గౌరవముంటే యూపీఏ ప్రభుత్వం తెచ్చిన 2013 భూసేకరణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసమే మూసీ ప్రాజెక్టు చేపట్టారని ఆరోపించారు. రేవంత్‌పై పార్లమెంట్‌లో ప్రివిలేజ్ మోషన్‌కు మూవ్ చేస్తామన్నారు. మూసీపై ప్రభుత్వాన్ని బాధితుల పక్షాన శాసనసభలో నిలదీస్తామన్నారు. 2014 భూసేకరణ చట్టం ప్రకారం మల్లన్నసాగర్, కొండపోచమ్మ నిర్వాసితులకు పరిహారం చెల్లించామని గుర్తు చేశారు. కట్టిన ఇళ్లను కూల్చమని చెబుతున్నారుంటూ మరి హైడ్రా కూల్చిన ఇళ్ల సంగతి ఏంటని ప్రశ్నించారు. రేవంత్ ప్రభుత్వం చేసిన పాపానికి శిక్ష ఎవరికి వేయాలని నిలదీశారు. ఇప్పటికే కూల్చిన ఇళ్లకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. మూసీ బాధితులను కేసీఆర్ ప్రభుత్వం కట్టిన డబుల్ బెడ్రూం ఇళ్లల్లోకి నెట్టి.రేవంత్ గొప్పలు చెబుతున్నారని హరీష్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## నేనేమీ ఆక్రమించలేదు

రంగనాయక్ సాగర్ దగ్గర హరీశ్‌రావు ఇరిగేషన్ భూములు ఆక్రమించాడంటూ సీఎం నిరాధార ఆరోపణలు చేశారని హరీశ్ రావు ధ్వజమెత్తారు. తాను నిబంధనలకు లోబడి ధరణి ద్వారా భూమిని కొనుగోలు చేశానని, ఒక్క గుంట కూడా ఆక్రమించలేదని స్పష్టం చేశారు. తనపై ఆరోపణలు చేసిన ముఖ్యమంత్రికి వాటిని నిరూపించాల్సిన బాధ్యత ఉందని, ఆయన ఎప్పుడు వస్తారో చెబితే తాను ఆ భూమి వద్దకు వస్తానని సీఎం రేవంత్ రెడ్డికి సవాలు విసిరారు. ప్రాజెక్టుల కోసం సేకరించిన భూమిని బదలాయించుకుని హరీశ్‌రావు రంగనాయక సాగర్‌లో ఫామ్‌హౌస్ నిర్మించారని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. సీఎం ఆరోపణలపై హరీస్‌రావు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. ఒక్క గుంట భూమి ఆక్రమించినట్టు తన చరిత్రలోనే లేదని, ఆక్రమణల చరిత్ర ముఖ్యమంత్రికే ఉందంటూ ధ్వజమెత్తారు. ఆక్రమణలలో మునిగితేలే రేవంత్ రెడ్డికి అందరూ దొంగల్లానే కనిపిస్తారని ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయలేక ప్రతిపక్షంపై నిందలు వేస్తూ రేవంత్ కాలం గడుపుతున్నారని మండిపడ్డారు. 11 నెలల కాలంలో సీఎం, ఆయన మంత్రులు చేసిందేమీ లేదని విమర్శించారు. లోపాలను ఎత్తి చూపుతున్న కేటీఆర్‌పై కేసులు పెట్టే కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు.

# మహనీయుడు మహాత్మ జ్యోతిరావు పూలే

## నివాళులర్పించిన మాజీ సీఎం జగన్



**మహా:** ప్రముఖ సంఘసంస్కర్త మహాత్మ జ్యోతిరావు పూలే గొప్ప మహనీయుడని, ఆయన అనునిత్యం బడుగు, బలహీన వర్గాల కోసం పోరాడాన్నారు ఏపీ మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి. ముఖ్యంగా మహిళల అభివృద్ధి కోసం మహాత్మ పూలే ఎంతో కృషి చేశారంటూ గుర్తుచేశారు. నేడు మహాత్మ జ్యోతిరావు పూలే 134వ వర్ధంతి సందర్భంగా గురువారం తాడేపల్లిలోని తన నివాసంలో జ్యోతిరావు పూలే చిత్ర పటానికి జగన్ పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యమంలో పలువురు వైసీపీ నేతలు పాల్గొన్నారు. ఈ మేరకు జగన్ సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు. 'పూలే బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం నిరంతరం పోరాడిన మహనీయుడు. ముఖ్యంగా మహిళల అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారు. ప్రజలను చైతన్య పరిచేందుకు విద్య మాత్రమే సరైన మార్గమని నమ్మి, విద్యకు దూరంగా పేద ప్రజలను చేరదీసి వారికి విద్యాబుద్ధులు నేర్పారు పూలే. పూలే ఆశయ సాధనకు కృషి చేస్తాం' అంటూ అందులో పేర్కొన్నారు.

# ఇథనాల్ పరిశ్రమకు కారకులు బీఆర్ఎస్ నేతలు

- దిలావర్‌పూర్‌కు రా తేల్చుకుందాం
- కేటీఆర్‌కు మంత్రి సీతక్క సవాల్
- అనుమతులు ఇచ్చింది కేసీఆర్, కేటీఆరే అన్న సీతక్క
- ఇప్పుడు రెచ్చగొట్టే రాజకీయాలు చేయడం దుర్మార్గం



**హైదరాబాద్, మహా:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు మంత్రి సీతక్క సవాల్ విసిరారు. నిర్మల్ జిల్లాలోని దిలావర్‌పూర్‌కు రావాలని, ఇథనాల్ పరిశ్రమకు అనుమతులు ఎవరిచ్చారో అక్కడే తేల్చుకుందామన్నారు. అన్ని అనుమతులు ఇచ్చింది కేసీఆర్, కేటీఆరేనని ఆరోపించారు. కేటీఆర్ ఎక్కడెక్కడో తిరగడం వృథా అని, ఆందోళన జరుగుతున్న ప్రాంతానికే వెళ్లామన్నారు. ఎవరు అనుమతులు ఇచ్చారో అక్కడే తేల్చుదామన్నారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ, ఇథనాల్ కంపెనీకి గత ప్రభుత్వం అనుమతులిచ్చే నాటికి కంపెనీ డైరెక్టర్‌గా తలసాని శ్రీనివాస్ యాదవ్ తనయుడు తలసాని సాయి ఉన్నట్లు మరోసారి పేర్కొన్నారు. ఇథనాల్ కంపెనీ మరో డైరెక్టర్‌గా పుట్టా సుధాకర్ తనయుడు ఉన్నట్లు చెప్పారు. పుట్టా సుధాకర్, తలసాని శ్రీనివాస్ యాదవ్ వియ్యంకులని మంత్రి గుర్తు చేశారు. గతంలో గ్రామసభను నిర్వహించకుండానే ఇథనాల్ కంపెనీకి అనుమతులు ఇచ్చారని ఆరోపించారు. దిలావర్‌పూర్‌కు వచ్చేందుకు కేటీఆర్ సిద్ధమా? కాదా? చెప్పాలన్నారు.

హాస్టళ్లలో వరుసగా జరుగుతున్న సంఘటనల వెనుక కుట్ర ఉందని భావిస్తున్నట్లు చెప్పారు. కుట్రలపై విచారణ జరిపి కుట్రదారులను బయటపెడతామని హెచ్చరించారు. కుట్రలకు పాల్పడే అధికారులపై క్రిమినల్ చర్యలు పెడతామన్నారు. అవసరమైతే అధికారులను సర్వీసు నుంచి తొలగిస్తామని స్పష్టం చేశారు. అన్ని విషయాలను ఆధారాలతో సహా బయట పెడతామన్నారు. హాస్టళ్లలోని ఘటనల వెనుక తమకు అనుమానాలు ఉన్నాయని తెలిపారు. పదేళ్ళ పాలనలో అనేక తప్పులు చేసింది బీఆర్ఎస్ పార్టీయేనని, తెలంగాణను విధ్వంసం చేసింది కూడా బీఆర్ఎస్ అని ఘాటుగా వ్యాఖ్యానించారు. ప్రజలను తప్పుదోవ పట్టించే చిల్లర.. కుళ్ళు రాజకీయాలు బీఆర్ఎస్ చేస్తుందని దుయ్యబట్టారు. అధికారులను నిర్బంధించడం, దాడులకు కుట్రలు చేయడం దారుణమన్నారు. కాస్త ఆలస్యమైనా ఘటనల వెనుక ఎవరున్నారు, ఎవరి పాత్ర ఏమిటన్నది కావాస్తవాలు ఆలస్యంగా అయినా బయటకి వస్తాయన్నారు. ఇథనాల్ కంపనీ అనుమతులు తదితర అంశాలపై అసెంబ్లీలో కూడా చర్చపెడతామని, స్పీకర్ టేబుల్ పై అన్ని ఆధారాలను ఉంచుతామన్నారు. కొండపోచమ్మ, మల్లన్న సాగర్ లలో రాత్రికి రాత్రి రైతులను ఊర్లు ఖాళీ చేయించారన్న మంత్రి మేము అలా చేయడం లేదన్నారు. దిలావర్ పూర్ లో గ్రామ సభ జరుపుతామని, తర్వాత ఏం చేయాలనేది నిర్ణయిస్తామన్నారు.


**శైలజ కుటుంబాన్ని ఆదుకుంటాం**

కలుషిత ఆహారం తిని మరణించిన విద్యార్థి శైలజ కుటుంబానికి అన్ని రకాలుగా ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. ఆ విద్యార్థికి 25 రోజులు చికిత్స అందించామని, బతికించుకునేందుకు దాదాపు రూ 15 లక్షలు వైద్యం కోసం ఖర్చు చేయడం జరిగిందన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఎన్నో ఫుడ్ పాయిజన్ ఘటనలు జరిగాయి, ఎంతోమంది విద్యార్థులు మరణించారంటూ ఆ విద్యార్థుల జాబితాను మీడియాకు విడుదల చేశారు. అప్పుడు విద్యార్థులు మరణిస్తే పట్టించుకోకపోగా కనీసం కనీసం పరామర్శించలేదని, పరిహారం కూడా చెల్లించలేదన్నారు. హాస్టల్ లలో ఫుడ్ పాయిజన్ మీద కుట్రలు జరుగుతున్నాయనే అనుమానాలుఉన్నాయని, అధికారులు ఎవరైనా కుట్రలకు సహకరిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. రాజకీయ నాయకులు వెనక ఉండి కుట్రలు చేస్తున్నారనే డౌట్ కూడా ఉందని, ఆధారాలతో బయటపెట్టి చర్యలు తీసుకుంటామన్నారు.

# ఖైరతాబాద్‌లో సినీ నటుడు నాగార్జున సందడి

## ఆర్టీఏ కార్యాలయానికి వచ్చిన మన్మథుడు

ఇటీవల ఒక లగ్జరీ కారును కొనుగోలు చేసిన నాగార్జున
రిజిస్ట్రేషన్ కోసం ఆర్టీఏ కార్యాలయానికి వచ్చిన నాగ్
పెద్ద సంఖ్యలో అక్కడకు చేరుకున్న అభిమానులు



**హైదరాబాద్, మహా :** టాలీవుడ్ స్టార్ హీరో అక్కినేని నాగార్జున గురువారం ఖైరతాబాద్లోని ఆర్టీఏ కార్యాలయంలో సందడి చేశారు. ఇటీవలే ఆయన ఒక హైఎండ్ లగ్జరీ కారును కొనుగోలు చేశారు. కొత్త కారు రిజిస్ట్రేషన్ కోసం ఆయన ఆర్టీఏ కార్యాలయానికి వచ్చారు. అధికారుల సమక్షంలో ఫొటో దిగి రిజిస్ట్రేషన్ పనులు పూర్తి చేశారు. మరోవైపు, నాగార్జున వచ్చారనే విషయం తెలుసుకుని అక్కడకు పెద్ద సంఖ్యలో అభిమానులు చేరుకున్నారు. నాగార్జునతో సెల్ఫీ దిగేందుకు వారు పోటీ పడ్డారు. నాగార్జున రాకకు సంబంధించిన సమాచారాన్ని ముందే తెలుసుకున్న పోలీసులు అక్కడ బందోబస్తు ఏర్పాటు చేశారు. అయినప్పటికీ అభిమానుల రాకతో ఆ ప్రాంతంలో కొంత సేపు ట్రాఫిక్ కు అంతరాయం ఏర్పడింది.



# రేవంత్ ఇంట సమగ్ర సర్వే

## వివరాలు నమోదు చేసిన అధికారులు

**మహా, హైదరాబాద్:** సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ మరియు కుల సర్వేలో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి తమ కుటుంబ వివరాలను నమోదు చేయించుకున్నారు. ఎన్యుమరేటర్, అధికారులు.. సీఎం రేవంత్ చెప్పిన కుటుంబ వివరాలను నమోదు చేశారు. హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి, సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వివరాలు నమోదు చేసిన అనంతరం అధికారులతో మాట్లాడిన సీఎం.. సర్వే పురోగతి వివరాలను అడిగి తెలుసుకున్నారు. సర్వేపై ప్రజల స్పందన ఎలా ఉందని ఆరా తీశారు.

**స్పెషల్ డ్రైవ్ నిర్వహించండి..**

హైదరాబాద్ పరిధిలో వీవీఐపీలు, ఐఏఎస్, ఐపీఎస్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధుల కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి, వివరాలు నమోదు చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. ప్రభుత్వ ఉద్యోగుల వివరాలను సర్వేలో కచ్చితంగా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. వీలైనంత త్వరగా కుల సర్వే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు.

# కొండా సురేఖకు బిగ్ షాక్

.. కేసు నమోదు చేయాలని నాంపల్లి కోర్టు ఆదేశాలు
.. డిసెంబర్ 12న వ్యక్తిగతంగా హాజరుకావాలని సమన్లు



**హైదరాబాద్, మహా:** నటుడు నాగార్జున ఇష్యూలో మంత్రి కొండా సురేఖకు బిగ్ షాక్ తగిలింది. పిటిషన్ తరుపు న్యాయవాది వాదనలకు న్యాయస్థానం ఏకీభవించింది. నాగార్జున వేసిన పిటిషన్‌ను కాగ్నిజెన్స్‌లోకి కోర్టు తీసుకుంది. మంత్రి కొండా సురేఖపై కేసు నమోదు చేయాలని నాంపల్లి కోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. సిసి నెంబర్ 490/2024, 356బిఎన్ ఎస్ యాక్ట్ కింద కొండా సురేఖపై కేసు నమోదు చేసింది. సురేఖకు నాంపల్లి కోర్టు సమన్లు జారీ చేసింది. డిసెంబర్ 12వ తేదీన వ్యక్తిగతంగా హాజరుకావాలని ఆదేశించింది. తన ఫ్యామిలీని కించపరిచేలా కొండా సురేఖ వ్యాఖ్యలు చేశారంటూ నాగార్జున పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. ప్రముఖ నటులు అక్కినేని నాగచైతన్య, సమంత విడిపోవడానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ కారణమంటూ మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలు తీవ్ర దుమారాన్ని రేపాయి. మంత్రి వ్యాఖ్యలను అక్కినేని నాగార్జున తీవ్రంగా ఖండించారు. క్రిమినల్ పిటిషన్ దాఖలు చేశారు.

# వాయిదా.. వాయిదా.. వాయిదా..




**మహా:** పార్లమెంటు శీతాకాల సమావేశాలు కొనసాగుతున్నాయి. సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి కూడా ప్రతిపక్షాలు పెద్ద ఎత్తున ఆందోళన చేస్తున్నాయి. అదానీ అంశంపై చర్చ పెట్టాలంటూ పట్టుబడుతున్నాయి. ఈ క్రమంలో ఉభయ సభల వాయిదాల పర్వం కొనసాగుతుంది. నేడు మూడో రోజు కూడా పార్లమెంటు ఉభయ సభల్లో రభస కొనసాగింది. అమెరికా దేశంలో అదానీ సంస్థపై నమోదైన కేసుకు సంబంధించి వెంటనే చర్చ పెట్టాలని, అదానీని జైలుకు పంపాలంటూ ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. దీంతో ఉభయసభల్లోనూ గందరగోళ వాతావరణ పరిస్థితి ఏర్పడింది. ఈ క్రమంలో ముందుగా మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు. ఆ తరువాత తిరిగి ప్రారంభమైన తరువాత కూడా పరిస్థితిలో ఎటువంటి మార్పు కనిపించలేదు. ఎట్టి పరిస్థితుల్లో అదానీ అంశంపై చర్చ పెట్టాలంటూ వారు పట్టుబట్టారు. ఈ క్రమంలో లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా సభను రేపటికి వాయిదా వేశారు. అటు రాజ్యసభలో కూడా సేమ్ రీపిటయ్యింది. పరిస్థితిలో మార్పు లేకపోవడంతో చేసేదేమీ లేక చైర్మన్ జగదీప్ ధన్‌కర్ కూడా సభను రేపటి వాయిదా వేశారు. ఇదిలా ఉంటే.. ఉదయం లోక్ సభ ప్రారంభం కాగానే ఇటీవలే నిర్వహించిన ఉప ఎన్నికల్లో కొత్తగా ఎన్నికైన ఎంపీల చేత స్పీకర్ ప్రమాణం స్వీకారం చేయించారు.

# ఝార్ఖండ్ సీఎంగా హేమంత్ సోరెన్

## ప్రమాణ స్వీకారం చేయించిన గవర్నర్ సంతోష్ గాంగ్వార్

కార్యక్రమానికి హాజరైన కూటమి నేతలు



**రాంచీ, మహా :** ఝార్ఖండ్ ముఖ్యమంత్రిగా జేఎంఎం నేత హేమంత్ సోరెన్ ప్రమాణ స్వీకారం చేశారు. ఇటీవల జరిగిన ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో జేఎంఎంకాంగ్రెస్ కూటమి విజయం సాధించింది. దీంతో హేమంత్ సోరెన్ రాష్ట్ర 14వ ముఖ్యమంత్రిగా ప్రమాణం చేశారు. ఝార్ఖండ్ రాజధాని రాంచీలోని మొరహాబాద్ మైదానంలో గవర్నర్ సంతోష్ కుమార్ గంగ్వార్ ఆయనతో ప్రమాణం చేయించారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్, కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, యూపీ మాజీ సీఎం అఖిలేశ్ యాదవ్ తదితరులు హాజరయ్యారు. హేమంత్ సోరెన్ నాలుగోసారి సీఎంగా బాధ్యతలు చేపట్టారు. ఈ ఏడాది ప్రారంభంలో భూ కుంభకోణానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో జనవరి 31న ఈడీ అతనిని అరెస్ట్ చేసింది. సీఎం పదవికి రాజీనామా చేసిన అతను ఐదు నెలల తర్వాత జైలు నుంచి విడుదలయ్యారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో 81 స్థానాలు ఉండగా జేఎంఎం 34 చోట్ల విజయం సాధించింది. బీజేపీ 21, కాంగ్రెస్ 16, ఆర్జేడీ 4, సీపీఐ(ఎంఎల్)(ఎల్) రెండు, ఏజేఎస్‌యూపీ, లోక్ జనశక్తి పార్టీ (రాంవిలాస్ పాశ్వాన్), జేఎల్‌కేఎం, జేడీయూ పార్టీలు ఒక్కో సీటు చొప్పున గెలిచాయి.

# ధరణి ధరఖాస్తులకు మోక్షం

## ఆర్జీలపై స్పెషల్ ఫోకస్

వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన నవీన్ మిట్టల్
కలెక్టర్‌లపై పని భారం తగ్గింపు
ప్రతీదీ పారదర్శకంగా ఉంచాలని ఆదేశం



**హైదరాబాద్, మహా :** ధరణి పెండింగ్ దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి, సీసీఎల్ఏ నవీన్‌మిట్టల్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు, తహశీల్దార్లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన నవీన్‌మిట్టల్ పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. లక్షకు పైగా పెండింగ్‌లో అర్జీలున్నాయని వెంటనే పరిష్కరించాలన్నారు. అర్జీలను తహసీల్దార్ స్థాయి అధికారులు స్వీకరించాలని, వాటిని ఆర్డీఓ స్థాయి అధికారి వెరిఫై చేయాలని ఆదేశించారు. ఎమ్మార్వో, ఆర్డీఓలు పంపిన వివరాల ఆధారంగా అర్జీలను అడిషనల్ కలెక్టర్ ఆమోదించవచ్చని, తిరస్కరించవచ్చన్నారు. ఫైనల్‌గా కలెక్టర్ తుది నిర్ణయం తర్వాత అడిషనల్ కలెక్టర్ ఆమోదించాలని సూచించారు.

గతంలో అన్ని మాడ్యూల్స్ కలెక్టర్లే చేయడంతో ఆ పనిభారంతో ఆప్లికేషన్లు పెండింగ్‌లో ఉండేవన్నారు. ఇప్పుడు వారికి పని తగ్గించి అందులో కొన్ని బాధ్యతలు, అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ, ఆర్డీవోలకు అప్పగించారు. ప్రభుత్వం వచ్చాక 3 సార్లు స్పెషల్ డ్రైవ్‌లు అయినా పెండింగ్ ఆప్లికేషన్లు క్లియర్ కాలేదన్నారు. ప్రభుత్వ ఒత్తిడితో దాదాపుగా అన్నీ రిజెక్ట్ చేసుకుంటూ పోయారన్నారు.. ఆ తర్వాత మళ్లీ అప్లై చేసుకోవడంతో పెండింగ్ అప్లికేషన్ల సంఖ్య భారీగా పెరుగుతుందని చెప్పారు. ప్రత్యేకంగా రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి, యాదాద్రిలో ఎక్కువ అప్లికేషన్లు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. గతంలో ధరణి విషయంలో ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకురావద్దని అన్నారు.. కొత్త ఆర్వోఆర్ చట్టం ఈ అసెంబ్లీ సెషన్స్‌లో తీసుకొస్తున్నారని చెప్పారు. ఈ లోపు ధరణి పెండింగ్ అప్లికేషన్లు క్లియర్ చేయాలని టార్గెట్‌గా పెట్టుకున్నామని నవీన్‌మిట్టల్ తెలిపారు.

**జీరో స్టేజికి తీసుకురావాలి...**

పెండింగ్ దరఖాస్తులను త్వరగా పరిశీలించి జీరో స్టేజికి తీసుకురావాలని ఆదేశించారు. దరఖాస్తులు వేగవంతంగా క్లియర్ చేసేందుకు ఎమ్మార్వోలకు అదనంగా లాగిన్‌లు ఇచ్చారు. రోజుకు వంద చొప్పున పెండింగ్ దరఖాస్తులు పరిశీలించాలని లక్ష్యాన్ని విధించారు. పరిష్కరించిన ప్రతి దరఖాస్తుకూ ప్రొసీడింగ్ ఆర్డర్‌ను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని.. తిరస్కరిస్తే, ఎందుకు రిజెక్ట్ చేశారో తెలుపుతూ రిమార్కులను నమోదు చేయాలని ఆదేశించారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో ఓపెన్ చేసేందుకు, వాటి పరిష్కారానికి అవసరమైన రిపోర్టులు అప్‌లోడ్ చేసేందుకు ప్రత్యేక లాగిన్‌లు ఇచ్చారు. ఇప్పటి వరకూ తహశీల్దార్లకు ఒకే లాగిన్ ఉండేది. ఆ లాగిన్ ద్వారానే ధరణి దరఖాస్తుల పరిశీలన, రిపోర్టుల అప్‌లోడ్, భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరిగేవి. ఇప్పుడు వారికి అదనంగా మరో లాగిన్ ఇవ్వాలని కలెక్టర్లకు నవీన్ మిట్టల్ సూచించారు. ఒక లాగిన్ ద్వారా ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం, మరో లాగిన్ ద్వారా భూముల రిజిస్ట్రేషన్ చేయాలని ఆదేశించారు. డిప్యూటీ తహసీల్దార్లకు (డీటీ) ఇచ్చిన లాగిన్ ద్వారా ధరణిలో వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లు చేయాలని ఆదేశించారు. ఇప్పటి వరకూ లాగిన్‌లు ఇచ్చే అధికారం కలెక్టర్లకు ఉండగా, ఆ బాధ్యతలను నుంచి వారిని తప్పించి అదనపు కలెక్టర్లకు అప్పగించారు.

ప్రతి సమస్య పరిష్కారానికీ ఒక ప్రత్యేక మాడ్యూల్ ఉందని, వాటి ద్వారా అన్నీ పరిష్కరించాలని సూచించారు. పరిష్కారానికి వీలులేని దరఖాస్తులు ఉంటే కారణాలు చెప్పి రిజెక్ట్ చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ రూల్ పొజిషన్‌కు లోబడి పని చేయాలని ఆదేశించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కొన్ని మాడ్యూల్స్‌లో వచ్చిన దరఖాస్తులకు మాత్రమే ప్రొసీడింగ్ ఆర్డర్‌ను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి మిగతా దరఖాస్తులను చెక్‌లిస్టులో ఉన్న సమాచారం ఆధారంగా అప్రూవ్ చేసేవారన్నారు. ఇప్పుడు ఆ విధానానికి స్వస్తి పలికి ప్రొసీడింగ్ ఆర్డర్‌ను తప్పనిసరిగా అప్‌లోడ్ చేసే విధానాన్ని తీసుకొచ్చినట్లు నవీన్‌మిట్టల్ వెల్లడించారు.

# మోగనున్న పంచాయతీ నగారా

**హైదరాబాద్, మహా:** స్థానిక ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం నడుంబిగించింది. సంక్రాంతికి పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ ఇవ్వనుండగా, మూడు దశల్లో ఈ ఎన్నికలు జరపాలని ఇప్పటికే ప్రణాళిక రెడీ చేసింది. గత జనవరి 31 తో సర్పంచ్ ల పదవీకాలం ముగియగా, ప్రత్యేక అధికారి పాలనలో గ్రామపంచాయతీలున్నాయి. గ్రామపంచాయతీలకు సంబంధించి గత ప్రభుత్వం పెద్ద ఎత్తున బకాయిలు ఉంచగా, విడతల వారీగా బకాయిలు చెల్లించాలని ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఫిబ్రవరిలో ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం కసరత్తు చేస్తుండగా, మూడు దశలలో పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. పంచాయితీ ఎన్నికల్లో పోటీకి ఇద్దరు పిల్లలకు మించి ఉండకూడదన్న నిబంధనను ప్రభుత్వం ఎత్తివేయనుంది. ఈ నిబంధన పై అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి బిల్లు పెట్టనున్నారు. ఎంపీటీసీ ఎన్నికలకు కూడా కసరత్తు మొదలైంది. సర్పంచ్ ఎన్నికల తర్వాత ఎంపీటీసీ ఎన్నికలునిర్వహించే యోచనలో ప్రభుత్వం ఉంది. కొన్ని మండలాలకు ముగ్గురు ఎంపీటీసీలతో నే ఎంపీపీలు ఉండగా, కనీసం ఐదుగురు ఎంపీటీసీలతో ఎంపీపీలు ఉండేలా ఆయా మండలాల్లో సంఖ్య పెంపుపై కసరత్తు చేస్తోంది. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ఎంపీపీల సంఖ్య సవరణ బిల్లును ప్రభుత్వం ప్రవేశ పెట్టనుంది. గత జులై రెండు తో ఎంపీటీసీల పదవీ కాలం ముగిసింది. రాష్ట్రంలో మొత్తం 12,751 గ్రామ పంచాయతీలు, 538 జడ్పిటిసిలు, 5,817 ఎంపీటీసీలకు ఎన్నికలు జరగనున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల కోసం డెడికేటెడ్ కమిషన్ ను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేయగా, డిసెంబర్ 10కల్లా డెడికేటెడ్ కమిషన్ నివేదిక అందజేయనుంది.

# ప్రజా పాలన - ప్రజా విజయోత్సవాలు 2024

## షెడ్యూల్ ఇలా..

**డిసెంబర్ 1, 2024**

- ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ 2వ దశకు శంకుస్థాపన కార్యక్రమాలు.
- విద్యార్థుల కోసం వ్యాస రచన పోటీలు.
- సీఎం కప్ పోటీలు (డిసెంబర్ 1 నుంచి డిసెంబర్ 8 వరకు)

**డిసెంబర్ 2, 2024**

- 16 నర్సింగ్ మరియు 28 పారా మెడికల్ కళాశాలల ప్రారంభోత్సవం.
- 213 కొత్త అంబులెన్సులు ప్రారంభం.
- 33 ట్రాన్స్ జెండర్ క్లినిక్‌ల ప్రారంభం.
- ట్రాఫిక్ వాలంటీర్లుగా ట్రాన్స్ జెండర్ల పై పైలట్ ప్రాజెక్టు.

**డిసెంబర్ 3, 2024**

- హైదరాబాద్ రైజింగ్ కార్యక్రమాలు.
- ఆరంగర్ నుండి జూ పార్క్ ఫ్లైఓవర్ ప్రారంభం.
- రూ. 150 కోట్లు విలువైన బ్యూటిఫికేషన్ పనుల ప్రారంభం.

**డిసెంబర్ 4, 2024**

- తెలంగాణ ఫారెస్ట్ డెవెలప్మెంట్ కార్పొరేషన్ భవన శంకుస్థాపన.
- వర్చువల్ సఫారి మరియు వృక్ష పరిచయం కేంద్రం ప్రారంభం.
- 9,007 మందికి నియామక పత్రాల పంపిణీ.

**డిసెంబర్ 5, 2024**

- ఇందిరా మహిళా శక్తి బజార్ ప్రారంభం.
- స్వయంసహాయక గ్రూపుల్లో చర్చలు
- 3 (మేడ్చల్, మల్లేపల్లి, నల్గొండ లో) అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ల ప్రారంభం.
- ఘట్ కేసర్ లో బాలికల ITI కాలేజీ ప్రారంభం.

**డిసెంబర్ 6, 2024**

- యాదాద్రి పవర్ ప్లాంట్ లో విద్యుదుత్పత్తి ప్రారంభం.
- 244 విద్యుత్ ఉపకేంద్రాల శంకుస్థాపన.

**డిసెంబర్ 7, 2024**

- స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ ప్రారంభం.
- పోలీస్ బ్యాండ్ ప్రదర్శన.
- తెలంగాణ కళా ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు.

**డిసెంబర్ 8, 2024**

- 7 ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) ప్రాజెక్టుల ప్రారంభం.
- 130 కొత్త మీ సేవల ప్రారంభం.
- యంగ్ ఇండియా యూనివర్శిటీకి శంకుస్థాపన.
- తెలంగాణ కళా ప్రదర్శనలు, సాంస్కృతిక వేడుకలు.

**డిసెంబర్ 9, 2024**

- లక్షలాది మంది మహిళా శక్తి సభ్యుల సమక్ష్యంలో తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణ. ■ ట్యాంక్ బండ్ మీద ముగింపు వేడుకలు
- డ్రోన్ షో, ఫైర్ వర్క్, ఆర్ట్ గ్యాలరీ, వివిధ స్టాళ్ల ఏర్పాటు


EDITORIAL ఎడిటోరియల్

# జార్ఖండ్ రాజకీయాల్లో హేమంత్ రికార్డు



జార్ఖండ్ లో సుస్థిర ప్రభుత్వం ఏర్పడింది. మన ఐక్యతే మన అతిపెద్ద ఆయుధమని తన ప్రమాణ స్వీకారం సందర్భంగా 49 ఏళ్ల హేమంత్ సోరెన్ ప్రకటించారు. హేమంత్ సోరెన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడం ఇది నాలుగోసారి. జార్ఖండ్‌లో వరుసగా రెండు సార్లు ఏ పార్టీ కూడా విజయం సాధించలేదు. కాని 24 ఏళ్ల ఆ రికార్డును బద్దలుకొట్టి హేమంత్ సోరెన్ వరుసగా ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టారు. మొట్టమొదట రాజ్యసభ సభ్యుడిగా తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత 2009లో తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఇక 2010 నుంచి 2013 వరకు బీజేపీజేఎంఎం కూటమి ప్రభుత్వంలో అర్జున్ ముండా జార్ఖండ్ ముఖ్యమంత్రిగా పనిచేయగా.. హేమంత్ సోరెన్ ఉపముఖ్యమంత్రిగా విధులు నిర్వర్తించారు. ఆ తర్వాత 2013లో కాంగ్రెస్, ఆర్జేడీ పార్టీల మద్దతుతో జేఎంఎం జార్ఖండ్‌లో అధికారాన్ని ఏర్పాటు చేయగా.. తొలిసారి హేమంత్ సోరెన్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఇక 2014లో జార్ఖండ్‌లో బీజేపీ అధికారంలోకి రావడంతో హేమంత్ సోరెన్ అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా ఉన్నారు. ఆ తర్వాత 2019లో జేఎంఎంకాంగ్రెస్ కూటమి విజయం సాధించడంతో మరోసారి ముఖ్యమంత్రిగా హేమంత్ సోరెన్ బాధ్యతలు చేపట్టారు. ఆ రాష్ట్ర రాజధాని రాంచీలోని మొరహాబాదీ గ్రౌండ్‌లో జరిగిన ప్రమాణ స్వీకార కార్యక్రమానికి కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీ, బెంగాల్, తమిళనాడు సీఎంలు మమతా బెనర్జీ, ఎంకే స్టాలిన్, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్, బీహార్‌లో ప్రతిపక్ష నేత తేజస్వీ యాదవ్ తదితరులు హాజరయ్యారు. వాస్తవానికి మహారాష్ట్రపై ఇండియా కూటమి ఎన్నో ఆశలు పెట్టుకున్నా అవి విఫలమయ్యాయి. జార్ఖండ్ లో మాత్రం హేమంత్ సోరెన్ విజయాన్ని ఒడిసిపట్టి జారవిడవలేదు. పట్టుజారలేదు. తన బలాన్ని ప్రదర్శించి రెండున్నర దశాబ్దాల సెంటిమెంట్ ను బ్రేక్ చేశారు. సోరెన్ కు జైలుశిక్ష పడగా దీనికిబదులుగా గిరిజన వర్గాల నుంచి ఆయన సానుభూతి పొందారు. ఈ ఎన్నికల విజయానికి గణనీయంగా దోహదపడిన రైతు రుణమాఫీ, విద్యుత్ బిల్లు రాయితీలు , మైయా యోజన పథకంతో సహా ఇంకా అనేకగ్యారంటీలు సోరెన్ ను సక్సెస్ చేశాయి. వీటన్నింటికీ మించి సంప్రదాయ పట్టు, హేమంత్ గుండె ధైర్యం మరోసారి చారిత్రక గెలుపును అందించాయి. ఈ విజయంతో హేమంత్ సోరెన్ జార్ఖండ్ రాజకీయాల్లో తన నాయకత్వాన్ని మరింత సుస్థిరం చేస్తూ గిరిజనుల గుండెల్లో తన ప్రభావాన్ని ప్రదర్శించాడు.

# అధికారం దూరమైతే అంత అసహనమా..?




ఇటీవల తెలంగాణాలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం పై బీఆర్ఎస్ నాయకులు హరీష్ రావు కేటీఆర్ వ్యాఖ్యలు దేనికి సంకేతాలుగా భావించాలో అర్థం కావడంలేదన్నది చాలా మంది అభిప్రాయం. ప్రతిపక్ష పాత్ర పోషిస్తున్నారనుకుంటే తప్పులేదు. ప్రజల సమస్యల మీద ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు వారికుంది. ఆ ప్రశ్నలు ,విమర్శలు ఆ పరిధి వరకుంటే ఇబ్బందేమీ లేదు.ప్రభుత్వం ఇచ్చిన హామీలు అవి నెరవేర్చడంలో లోపాలు ఎత్తి చూపితే జనంలో కూడా మంచి అభిప్రాయమేర్పడుతుంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో చక్కటి ప్రతిపక్షంగా గుర్తింపు పొందుతుంది. అదే సమయంలో ప్రజల్లో గౌరవ భావం కూడా పెరుగుతుంది.ఇది ఆయా పార్టీలకి కావచ్చు లేదంటే వ్యక్తి గతంగా కావచ్చు భవిష్యత్తులో తిరిగి ప్రజల వద్దకు వెళ్లడంలో సహకరిస్తుంది. అలాంటివారు ఏ పార్టీలో ఉన్న రెడ్ కార్పెట్ పరిచి స్వాగతాలు పలకకపోయినా సాదర స్వాగతాలు మాత్రం ప్రజల నుండి ఆశించవచ్చు.


కాని ఇటీవలి రాజకీయ పరిణామాలు గమనిస్తే ప్రజలు పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ ను వద్దనుకుని కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టం కట్టారు.బీఆర్ ఎస్ పార్టీకి బలమైన ప్రతిపక్షం అన్న గుర్తింపు కూడా దక్కకుండా తీర్పునిచ్చారు. ఏ రాజకీయ పార్టీ అయినా ప్రజా తీర్పును గౌరవించి మసలుకుంటేనే భవిష్యత్తులో మనుగడ సాగించగలదు.అధికారం దూరమైంది కదా అని ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతాం..దూషిస్తాం శాపనార్థాలు పెడతామంటే అది వారి వ్యక్తిగత వివేచన. కాని టెక్నాలజి పెరిగిన తర్వాత సామాజిక మాధ్యమాల పరిధి పెరిగిన తర్వాత ఇక్కడ ప్రజలంతా గమనిస్తున్నారని అవన్నిరికార్డవుతున్నాయని సమయం వచ్చినప్పుడు ఏదీ మర్చిపోకుండా నాటిది నేటిది డబల్ బాక్సుల్లో ఢంకా భజాయించినట్టు ప్రచారం చేస్తారన్న విషయం ఆలోచించుకోవాలి.మరీ ముఖ్యంగా కేటీఆర్ అయితే అధికారం దూరమయి చాలా ఫ్రస్టేషన్ లో ఉన్నాడన్నది అందరు అనుకుంటున్నమాట .రోజురోజుకు తన మాటలో పంచ్ పవర్ పెరుగుతుందని అతనితో పాటు ఆ పార్టీ నేతలు సంబర పడవచ్చు.కాని ఇది కొంత పరిధిలో ఉంటేనే మంచిదన్నది విశ్లేషకులతో పాటు సామాన్యుని స్వరం. అదేదో సినిమాలో చెప్పినట్టు పవర్ లో ఉంటే చేతులు పని చేస్తాయి అధికారం కోల్పోతే నాలుక పని చేస్తుందన్నట్టుగా ఉంది పరిస్థితి. ప్రభుత్వాని పై విమర్శలు పాలకులపై ప్రశ్నలు , వ్యక్తి గత దూషణల పరిధి దాటి అధికారుల కు హెచ్చరికలు బెదిరింపుల వరకు రావడంతో శృతి మించినట్టు కనపడి అధికారం దూరమైన అసహనమే కావచ్చేమో అని చాలా మందిలో ఒక అభిప్రాయమైతే కలిగే అవకాశం ఏర్పడుతుంది.

ఇప్పటికే రోత పుట్టే వ్యాఖ్యలతో రాజకీయాలంటేనే అబ్బో అని దూరంగా జరుగుతున్న యువత , అసహ్యించుకునే ప్రజలకు ఎలా సర్ది చెబుతారు. ఒక ప్రధాన ప్రతి పక్ష పార్టీకి చెందిన నాయకుడు పదేళ్లు బాధ్యత కలిగిన మంత్రిగా ఉండి అధికారులకు ఆదేశాలిచ్చిన కేటీఆర్ అదే అధికారులనుద్దేశించి కాంగ్రెస్ కార్యకర్తల్లా పనిచేస్తున్నారని అలాంటి వారికి వడ్డీతో సహా చెల్లిస్తానన్నవిషయం గుర్తుపెట్టుకోవాలని వేలు చూపిస్తు వార్నింగ్ ఇచ్చిన సంగతిని తప్పుబడుతున్నారు. మరి వారు అధికారంలో ఉన్నప్పుడు అధికారులు బీఆర్ఎస్ కార్యకర్తలుగా పనిచేసారా అని ఎదురు ప్రశ్నించడం సహజమే. కాని రాజకీయాలలోకి పాపం అధికారులను లాగడమే ఇప్పుడు వారితో పాటు ఎవరికి నచ్చడం లేదు. ఖచ్చితంగా ఇది పవర్ దూరమైన పర్యవసానమే అంటున్నారు. అందుకే అలా మాట్లాడుతున్నాడన్నది వారి అభిప్రాయం .అందుకే పబ్లిక్ లో మాట్లాడే ముందు జర భద్రం నోటిని అదుపులో ఉంచుకోక పోతే మళ్లీ అధికారం కోరుకున్నా అది కట్టబెట్టే ప్రజలు అసహ్యించుకోకుండా చూసుకోండి..



- సత్యనారాయణ రావు, జర్నలిస్ట్

# జంతువులకు చలి పెట్టదా..?



**మహా:** ప్రస్తుతం శీతాకాలం కాబట్టి చలి గాలులు వీస్తున్నాయి. ఉష్ణోగ్రతలు దారుణంగా పడిపోతున్నాయి. దీంతో చలి తీవ్రత రోజురోజుకు పెరిగిపోతుంది తప్ప తగ్గడం లేదు. ఈ క్రమంలో ప్రజలు చలి నుంచి తట్టుకునేందుకు ఉన్నిదుస్తువులు వాడుతున్నారు. వీలున్నప్పుడు వేడి ఆహారాన్ని తీసుకోవడం లేదా వేడి పానీయాలను తీసుకోవడం వంటి తీసుకుని వెచ్చదనాన్ని పొందుతున్నారు. స్నానం చేసే సమయంలో కూడా వేడి నీటితో స్నానం చేస్తుంటారు. ఇవి మాత్రమే ఇంకా చాలా జాగ్రత్తలు తీసుకుంటారు. ఎందుకంటే చలికి మానవుల శరీరం తట్టుకోలేకపోతుంది. దీంతో వారు మృత్యువాతపడడం, వ్యాధుల బారిన పడడం లేదా ఇతర విధాలుగా ఇబ్బందులు ఎదుర్కొంటారు. ఈ క్రమంలోనే వారు ఉన్ని లేదా వెచ్చదనాన్ని ఇచ్చే ఇతర దుస్తువులను ధరిస్తుంటారు. ఇలా చలి నుంచి తమను తాము కాపాడుకునేందుకు తీసుకోవాల్సిన అన్ని జాగ్రత్తలు తీసుకుంటారు. కానీ, చాలామందికి ఓ సందేహం కలుగుతుంది. మనుషులకే ఈ మాదిరిగా చలి పెడుతుంది.. చలి నుంచి తట్టుకునేందుకు ఇన్ని జాగ్రత్తలు తీసుకుంటాం.. మరి జంతువుల పరిస్థితి ఏంటి..? అవి బయటనే ఉంటాయి.. చలికాలంలో వాటికి చలి పెట్టదా..? అవి ఏ ఉన్ని దుస్తువులను ధరించవు కదా..? ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవు కదా.. మరి వాటికి చలి పెట్టదా..? చలి నుంచి అవి ఎలా తమను తాము రక్షించుకుంటాయి..? అనే సందేహం చాలామందిలో కలుగుతుంది. ఇందుకు సంబధించి పలువురు నిపుణులు చెప్పినదాని ప్రకారం ఏమంటే... చలి ఒక్కటే కాదు వాతావరణంలో ఎలాంటి మార్పులు జరిగినా తట్టుకునేలా జంతువులు వివిధ పద్ధతులను అవలంభిస్తాయి. మనుషుల కన్నా చాలా జంతువులు ఎక్కువ ఆహారాన్ని తీసుకుంటాయి.

అదేవిధంగా గడ్డి, పండ్లు, మాంసాన్ని తింటుంటాయి. ఇలా అవి ఎక్కువ ఆహారం తీసుకోవడం వల్ల వాటి జీవక్రియ వేగవంతం అవుతుంది. దీంతో ఎక్కువ శక్తిని పొందుతాయి. ఈ కారణంగా అవి వెచ్చగా ఉండేందుకు ఎక్కువ శరీర వేడిని ఉత్పత్తి చేస్తుంది. పలు రకాల జంతువులు.. పులులు, సింహాలు, తోడేళ్లు, కోతులు, నక్కలు, కొండెంగలు తదితర జంతువులు తమ శరీరంపై ఒత్తయిన వెంట్రుకలు ఉండడం వల్ల చలి వాటి చర్మాన్ని నేరుగా తాకదు. అదేవిధంగా అవి ఆహారాన్ని ఎక్కువగా తీసుకోవడం వల్ల వాటికి శక్తి ఎక్కువగా ఉంటుంది. ఈ కారణంగా అవి చలి నుంచి తమను తాము కాపాడుకుంటాయి. మరికొన్ని జంతువులు... ఏనుగు, అడవి పందులు తదితర వంటి జంతువుల శరీరం చాలా మందంగా ఉంటుంది. దీంతో అవి ఎంత చలినైనా తట్టుకోగలుగుతాయి. కేవలం చలిని కాదు.. ఎండాకాలంలో ఎండను, వర్షం సమయంలో కూడా అవి తట్టుకోగలుగుతాయి.

**పెంపుడు జంతువుల విషయంలో...**

పెంపుడు జంతువులు.. కుక్కలు, పిల్లులు, కుందేళ్లు, కోళ్లు, ఎలుకలు వంటివి మాత్రం చలికి, ఎండ వాతావరణాన్ని తట్టుకోలేకపోతుంటాయి. దీంతో అవి చలికాలంలో వణికిపోతుంటాయి. ఈ క్రమంలో వాటిని పెంచుకునే యజమానులు వాటికి ఆశ్రయాన్ని ఏర్పాటు చేసి సంరక్షిస్తుంటారు. లేదా అవే వెచ్చగున్న చోటకు వెళ్లి నిద్రపోతుంటాయి. ఇలా అవి చలి నుంచి తప్పించుకోగలుగుతాయి.

**పక్షుల సంగతేంటి..?**

పక్షులు కూడా వాటిపై ఉన్న వెంట్రుకలు వత్తగా ఉండడం ఒక కారణమైతే, మరో కారణమేమంటే అవి తీసుకునే ఆహారం కూడా ఈ వాతావరణంలో వచ్చే మార్పులను తట్టుకుని ఉండేలా చేస్తాయి. పలు సందర్భాల్లో అయితే అవి గూళ్లలో దాగి ఉంటాయి. దీంతో అవి ఇలా చలి, ఎండ, వర్షం నుంచి ఎస్కేప్ అవుతాయి.

ఇలా జంతువులు చలి నుంచే కాదు ఎండకాలం, వానకాలంలో వచ్చే వాతావరణ మార్పులను అవి తట్టుకుని జీవించగలుగుతాయి. ముఖ్యంగా అవి ఆహారం ఎక్కువగా తీసుకోవడం, అదేవిధంగా గడ్డి, పండ్లు, మంసం వంటి ఆహారం తీసుకోవడం మరో కారణమైతే.. వాటిపై ఉన్న వెంట్రుకలు కూడా ఈ పరిస్థితులును తట్టుకుని నిలబడగలిగేలా చేస్తాయని వారు చెబుతున్నారు.

## గొర్రెలు, మేకలు, గుర్రాలు, ఆవుల పరిస్థితి ఏంటి..?

**ఇంట్లో పెంచుకునే జంతువులకు మన ఇంట్లో అవి ఆశ్రయం పొందుతాయి. అదే గొర్రెలు, మేకలు, బర్లు, గుర్రాలు, ఆవుల పరిస్థితి ఏమంటే.. గొర్లు, మేకలు, ఆవులు, ఎద్దుల శరీరంపై వెంట్రుకలు వత్తుగా ఉంటాయి. ఆ వెంట్రుకలు చాలా మందంగా, గట్టిగా ఉంటాయి. వీటితోపాటు ఆ జంతువుల శరీరం కూడా చాలా మందంగా ఉంటాయి. అదేవిధంగా అవి ఆహారంగా గడ్డిని తీసుకుంటాయి. ఇవన్నీ కూడా వాటికి హెల్ప్ అవుతాయి. అందుకే వాతావరణంలో ఎలాంటి మార్పు వచ్చినా అవి తట్టుకుంటాయి.**

# దీన్ని చల్లితే చాలు.. నిమ్మ చెట్లు ఏపుగా కాయలు కాస్తాయి..!



చాలా మంది తమ తమ ఇండ్లలో రకరకాల మొక్కలను పెంచుతుంటారు. వాటిల్లో నిమ్మ మొక్కలు కూడా ఒకటి. నిమ్మ మొక్కలను అంటు కట్టి పెంచితే అవి పెద్దగా పెరగాల్సిన పనిలేదు. చిన్నగా ఉండగానే గుత్తులుగా కాయలను కాస్తాయి. నిమ్మ కాయలను చాలా మంది ఇంట్లో కుండీల్లో లేదా పెరట్లో పెంచుతుంటారు. వాటిని తరచూ అనేక అవసరాలకు ఉపయోగిస్తుంటారు. అయితే కొన్ని సార్లు పలు కారణాల వల్ల నిమ్మ చెట్లు ఎండిపోతుంటాయి. లేదా నిమ్మచెట్లు కాయలను కాయవు. ఇందుకు అనేక కారణాలు ఉన్నప్పటికీ పలు రకాల చర్యలను తీసుకోవడం వల్ల నిమ్మ చెట్లు ఎక్కువగా కాయలు కాసేలా చేయవచ్చు.

## ఈ పోషకాలు అవసరం..

మనం ఇంట్లో లేదా పెరట్లో పెంచే ఏ చెట్టుకు లేదా మొక్కకు అయినా సరే సరైన పోషణ అవసరం. అప్పుడే అవి ఏపుగా పెరుగుతాయి. ఇక నిమ్మ చెట్టును సరిగ్గా సంరక్షిస్తే పుష్కలంగా కాయలు కాసేలా చేయవచ్చు. చెట్లకు అనేక రకాల పోషకాలు అవసరం అవుతాయి. వాటిల్లో పొటాషియం, నైట్రోజన్, ఫాస్ఫరస్ తదితరాలు ముఖ్యమైనవి. అయితే నిమ్మచెట్లకు కూడా ఇలాంటి పోషకాలే అవసరం అవుతాయి. నిమ్మచెట్టును పెంచేందుకు సరైన సూర్యకాంతి కావాలి. ఇంట్లో పెంచితే సూర్య కాంతి పడే చోట కుండీలను ఉంచాలి. అప్పుడే నిమ్మ చెట్టు సరిగ్గా పెరుగుతుంది. కాయలను కాస్తుంది. సూర్యకాంతి లేని చోట, చీకటిగా ఉన్న చోట్ల ఈ చెట్లను పెంచకూడదు. నిమ్మచెట్లను సూర్యకాంతిలో పెంచడం వల్ల కాయలు గుత్తులుగా వస్తాయి. అదే నీడలో పెంచితే కాయలు తక్కువగా వస్తాయి. లేదా కొన్ని సార్లు చెట్లు కాయలను ఇవ్వకపోవచ్చు.

## బోరాన్ లోపం ఉంటే..?

ఇక నిమ్మకాయలకు పువ్వులు వస్తున్నప్పుడు సరైన నీరు, పోషకాలు అందేలా చూడాలి. దీంతో పూత రాలిపోకుండా ఉంటుంది. కాయలు ఎక్కువగా కాస్తాయి. పువ్వులు వస్తున్న సమయంలో సరిగ్గా నీరు లేకపోయినా, పోషకాలు అందకపోయినా పూత రాలుతుంది. కాబట్టి ఈ జాగ్రత్తను తప్పనిసరిగా తీసుకోవాలి. అలాగే నిమ్మ చెట్లకు బోరాన్ పొడిని వేయడం వల్ల బోరాన్ లోపం రాకుండా చూసుకోవచ్చు. నిమ్మచెట్లు ఏపుగా పెరిగినప్పటికీ కాయలు కాయకపోతే అప్పుడు బోరాన్ లోపంగా భావించాలి. బోరాన్ మనకు ఆన్‌లైన్‌లో లేదా బయట కిరాణా షాపుల్లోనూ లభిస్తుంది. దీన్ని తెచ్చి ప్యాకెట్లలో పెట్టి మట్టిలో ఉంచాలి. దీంతో నిమ్మ చెట్లకు బోరాన్ లభిస్తుంది. కాయలు చక్కగా వస్తాయి. నిమ్మ చెట్లను పెంచే కుండీలు మరీ చిన్నగా ఉండకుండా చూసుకోవాలి. కాస్త పెద్దగానే కుండీలను పెట్టాలి. అలాగే 3 రోజులకు ఒకసారి పలుచని మజ్జిగను కాస్త పోస్తుండాలి. దీంతోపాటు బయట మార్కెట్‌లో లభించే సేంద్రీయ ఎరువులను వేస్తుండాలి. ఇలా కొన్ని చిట్కాలను పాటించడం వల్ల నిమ్మ చెట్లకు కాయలు చక్కగా వస్తాయి.

## రచనలకు ఆహ్వానం

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.

మీ రచనలు పంపాల్సిన చిరునామా:
editor@mahaadaily.com | whatsapp-
7436939999

# ఖమ్మంలో చెకుముకి సైన్స్ సంబురాలు



**ఖమ్మం సిటీ, నవంబర్ 28, మహా:** జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి సైన్ సంబురాలు నయా బజార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించారు. మండల స్థాయిలో జరిగిన టాలెంట్ టెస్టులో ప్రథమ స్థానం పొందిన విద్యార్థులు జిల్లా స్థాయికి హాజరయ్యారు. జిల్లా స్థాయి ప్రశ్నపత్రాలను మండల విద్యాశాఖ అధికారి. శైలజ లక్ష్మీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లల్లో శాస్త్రీయ జ్ఞానాన్ని వెలికితీయడానికి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థి దశలోనే శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించుకోవడం వలన మూఢనమ్మకాలకు దూరంగా ఉండి, దేశ ప్రగతికి తోడ్పడటాలని సూచించారు. జిల్లా స్థాయి పోటీ పరీక్షలకు దాదాపు అన్ని మండలాల నుండి 240 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఆయా విభాగాల వారిగా పరీక్ష, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర, జిల్లా కమిటీ సభ్యులు శివన్నారాయణ, ఎల్ వి రెడ్డి, తాతా రాఘవయ్య, ఎస్వీఆర్ పురుషోత్తం, శ్రీరాములు, ఐలయ్య, సీతారామారావు, రామకృష్ణ,డాన్ బాస్కో, వెంకటేశ్వర్లు, ప్రవీణ్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# హాస్టల్లో గ్యాంగ్ వార్..!

- సీనియర్, జూనియర్ విద్యార్థుల మధ్య ఘర్షణ
- పత్తా లేని అధికారులు



**ఖమ్మం, నవంబర్ 28, మహా:** హాస్టల్ లో విద్యార్థులు గ్యాంగ్ వార్ కు దిగారు. రాత్రి సమయంలో గేట్ తీయలేదు అనే నెపంతో పోస్ట్ మెట్రిక్ వసతి గృహంలో విద్యార్థుల ఘర్షణకు పాల్పడ్డారు. ఒకరిపై ఒకరు ముష్టి ఘాతాలు చేసుకునే స్థాయికి దిగజారారు. ఖమ్మం బైపాస్ రోడ్డులో ఉన్న ఈ పోస్ట్ మెట్రిక్ వసతి గృహం(ఏ)లో సుమారు 250 మందికి పైగా విద్యార్థులు ఉంటున్నారు. ఒక విద్యార్థి రాత్రి సమయంలో హాస్టల్ కు రాగా గేటు తీయకపోవడంతో ఘర్షణ మొదలైంది. గేటు దగ్గర కాపలా ఉండాల్సిన వాచ్ మెన్ ఏమయ్యాడో తెలియని పరిస్థితి నెలకొనడంతో ఈ వివాదం చెలరేగింది. అంతే కాకుండా హాస్టల్స్ లో నిత్యం పర్యవేక్షణ చేసే అధికారులు తగిన విధంగా వారిని సమన్వయం చేయలేకపోవడం ఘర్షణలకు మరింత ఆజ్యం పోసినట్టు అయ్యింది. ఈ క్రమంలో.. అర్ధరాత్రి వసతి గృహానికి వచ్చిన విద్యార్థిపై కొంతమంది సీనియర్ విద్యార్థులు దాడి చేశారు. దీనిని అవమానంగా భావించిన ఆ విద్యార్థి తనకు సంబంధించిన కొంతమంది మనుషులను వసతి గృహానికి తీసుకొచ్చి తనపై దాడి చేసిన విద్యార్థులపై దాడి చేయించినట్లు తెలిసింది. విద్యార్థులు గ్యాంగ్ వార్ లకు పాల్పడుతుంటే వసతి గృహ సంక్షేమ అధికారి మాత్రం వారిని సమన్వయపరిచి ప్రశాంత వాతావరణం నెలకొల్పడంలో పూర్తిగా విఫలమయ్యారు. విషయం తెలుసుకున్న ఏఎస్సీడీఓ, డిప్యూటీ డైరెక్టర్ వసతి గృహానికి చేరుకొని విద్యార్థులతో మాట్లాడి కౌన్సిలింగ్ నిర్వహించారు. విషయాన్ని పోలీసులకు తెలియజేశారు. బయట నుంచి మనుషుల్ని తీసుకువచ్చి హాస్టల్ విద్యార్థులపై దాడి చేశాడన్న కారణంతో ఒక విద్యార్థిని హాస్టల్ నుండి తొలగించారు. సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటామని అధికారులు పేర్కొన్నారు.

# ఆ రెండు రైల్వే లైన్లను మార్చండి



**ఖమ్మం, నవంబర్ 28, మహా:** పాలేరు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోని సారవంతమైన భూముల్లోంచి, స్తంభాద్రి అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ (సుడా) అతి ఖరీదైన స్థలాల్లోంచి వెళ్లేలా ప్రతిపాదించిన డోర్నకల్ మిర్యాలగూడ, గద్వాల రైల్వే లైన్ తో ఇక్కడి ప్రజలు తీవ్రంగా నష్టపోతారని.. లైన్ ను కచ్చితంగా మార్చాల్సిందేనంటూ రైల్వే బోర్డు చైర్మన్ సతీష్ కుమార్ ను ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి కోరారు. ఢిల్లీలో గురువారం రైల్వే ప్రధాన కార్యాలయంలో ఆయనను కలిసి.. ఈ మేరకు విన్నవించారు. డోర్నకల్ నుంచి వయా పాపడ్ పల్లి జాన్ పహాడ్ (మిర్యాలగూడ), అలాగే డోర్నకల్ గద్వాల రైల్వే లైన్లు పూర్తిగా పాలేరు నియోజకవర్గం మీదుగా వెళ్లనుండడంతో.. ఈ ప్రాంత వాసులకు తీరని నష్టం చేకూరుతుందని అన్నారు. రైతులు సారవంతమైన భూముల్ని కోల్పోతారని తెలిపారు.

# కేజీబీవీ టీచర్ల నిరసన



**ముదిగొండ, నవంబర్ 28, మహా:** కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ)లో యూఆర్ఎస్ సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఉద్యోగులు, ఉపాధ్యాయునీలు, నాన్ టీచింగ్ సిబ్బంది, వర్కర్లకు పోస్టులకు తగ్గ వేతనం మంజూరు చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పి. సురేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మినిమం టైం స్కేల్ సాధనలో భాగంగా భోజనం విరామం సమయంలో న్యూలక్ష్మీపురం కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం ఎదుట గురువారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. కేజీబీవీలో కేర్ టేకర్లను నియమించి, పిల్లలకు డైట్ చార్జీలు పెంచి, విద్యార్థినులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలన్నారు. వర్కర్స్ నుంచి, స్పెషల్ ఆఫీసర్స్ వరకు చాలీచాలని వేతనాలతో ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కేజీబీవీ ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే 2025 జనవరి 7న జిల్లా కేంద్రంలో నిరాహార దీక్ష, ఫిబ్రవరిలో చలో అసెంబ్లీ నిర్వహిస్తామని పి సురేష్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్ష ప్రధానకార్యదర్శులు వి. రాంబాబు, ఎస్కే జహీర్, మండల ఉపాధ్యక్షులు బి కిషన్, మండల కమిటీ సభ్యులు రవికిరణ్, కవిత,స్పెషల్ ఆఫీసర్ బండారు ఇందిర, ఉపాధ్యాయునీలు పాల్గొన్నారు.

# 210 కేజీల గంజాయి పట్టివేత

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, నవంబర్ 28, మహా:** ఆంధ్రప్రదేశ్ డొంకరాయి నుంచి మహారాష్ట్రలోని పూణేకు 210 కేజీల గంజాయిని కారులో తరలిస్తూ ఉండగా భద్రాచలం ఆర్టీవో చెక్ పోస్ట్ వద్ద భద్రాచలం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ సీఐ రహీం ఉన్నిసా బేగం సిబ్బంది కలిసి గురువారం పట్టుకున్నారు. వారి వద్ద నుంచి స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ రూ 53 లక్షలు ఉంటుందని తెలిపారు. గంజాయితోపాటు రూ. 5 లక్షల విలువ చేసే కారు, రెండు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. గంజాయిని పట్టుకున్న భద్రాచలం ఎక్సైజ్ పోలీసులను సీఐ రహీం ఉన్నిసా బేగం, ఎస్సై అల్లూరి సీతారామరాజు, సిబ్బందిని ఎక్సైజ్ ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టర్ వీబీ కమలహాసన్ రెడ్డి, జాయింట్ కమిషనర్ ఖురేషి, అసిస్టెంట్ కమిషనర్ జి గణేష్ అభినందించారు.

# మల్లంపల్లి ఇక మండలం

- జీవో 125 విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- ములుగు జిల్లాలో 10 మండలాలు
- సంబరాల్లో మండల ప్రజలు






**ములుగు, మహా:** ప్రత్యేక మండలం కావాలని కోరుతూ ఏళ్ల తరబడి మల్లంపల్లి వాసులు చేసిన నిరీక్షణలకు తెరపడింది. గురువారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ములుగు జిల్లా ములుగు మండలం మల్లంపల్లిని ప్రత్యేక మండలంగా ప్రకటిస్తూ జీవో 125 విడుదల చేసింది. మల్లంపల్లి, రాంచంద్రాపూర్ రెవెన్యూ గ్రామాలు, వాటి పరిధిలోని గ్రామపంచాయతీలను కలుపుకొని ప్రత్యేక మండలంగా ప్రకటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్ ఉత్తర్వులు వెలువరించారు. ప్రత్యేక మండలం కోసం చేపట్టిన పోరాటాలు ఫలించాయని, ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చిందని మల్లంపల్లి వాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ములుగు మాజీ జడ్పీ చైర్ పర్సన్, దివంగత నేత కుసుమ జగదీష్ పేరున మల్లంపల్లిని ప్రత్యేక మండలంగా ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఉండగా ప్రభుత్వం మల్లంపల్లి పేరుతోనే జీవో విడుదల చేసింది.

**మల్లంపల్లితో ములుగు జిల్లాలో 10 మండలాలు..**

ములుగు జిల్లాలో ములుగు, వెంకటాపూర్, గోవిందరావుపేట, తాడ్వాయి, ఏటూరునాగారం, మంగపేట మండలాలతోపాటు నూతనంగా ఏర్పాటైన కన్నాయిగూడెం, ఖమ్మం జిల్లాలోని వాజేడు, వెంకటాపురం మండలాలను కలుపుతూ మొత్తం 9మండలాలతో జిల్లాను ఏర్పాటు చేశారు. అయితే గురువారం ప్రభుత్వం విడుదల చేసిన జీవోతో మల్లంపల్లి మండలాన్ని కలుపుకొని 10 మండలాలు అయ్యాయి. 2016లో జిల్లాల పునర్విభజన జరుగగా అప్పటి నుంచి ములుగు జిల్లా కోసం మల్లంపల్లి ప్రత్యేక మండలం కోసం పోరాటాలు జరిగాయి. 2019, ఫిబ్రవరి 17న ములుగును జిల్లాగా ప్రకటించినప్పటికీ మల్లంపల్లిని మాత్రం వదిలేశారు. అయితే 2023 అసెంబ్లీ ఎన్నికల ముందు గత బీఆర్ఎస్ ప్రభుత్వం మల్లంపల్లిని మండలంగా ఏర్పాటు చేసేందుకు నోటిఫికేషన్ జారీ చేసింది. అయితే అందులో కూడా పారదర్శకత లోపించడంతో అది ఆగిపోయింది. కాగా, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమశాఖల మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క స్పష్టమైన హామీ మేరకు ప్రభుత్వం 125జీవో విడుదల చేయడంతో హర్షాతిరేకాలు వెల్లువెత్తున్నాయి. మల్లంపల్లి మండలంలో మల్లంపల్లి, మహ్మద్గౌస్పల్లి, రాంచంద్రాపురం, పందికుంట, కొడిశెలకుంట, శివతండా, ముద్దునూరు తండా, దేవనగర్, శ్రీనగర్, గుర్తుర్తండా గ్రామపంచాయతీలు అంతర్భాగమయ్యాయి. మొత్తం 10జీపీలు మల్లంపల్లి మండలంలో కొనసాగనుండగా ములుగు మండలంలో 22 జీపీలు మాత్రమే ఉండనున్నాయి.

### మంత్రి సీతక్కకు మల్లంపల్లి మండల ప్రజల కృతజ్ఞతలు

మల్లంపల్లి మండలం కోసం మండల సాధన సమితి ఏర్పాటు చేసుకొని నెలల తరబడి ఉద్యమాలు చేసిన యువకులు, గ్రామస్థులు ఆ కళ నెరవేరడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. పాదయాత్రలు, ధర్నాలు, నిరసన దీక్షలు చేసినందుకు తమకు ఫలితం దక్కిందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అందుకు గాను ఇచ్చిన మాట నిలబెట్టుకున్న రాష్ట్ర మంత్రి సీతక్కకు సోషల్ మీడియా ద్వారా మండల సాధన సమితి నాయకులు, ఉద్యమ జేఏసీ నాయకులు, వివిధ పార్టీల నేతలు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా మల్లంపల్లిలో పుట్టి పెరిగిన మాజీ జడ్పీ చైర్ పర్సన్ దివంగత కుసుమ జగదీష్ కళ సాకారమైనట్లు మండల ప్రజలు భావిస్తున్నారు. కాగా, మల్లంపల్లి, రాంచంద్రాపూర్ గ్రామాల్లో బాణాసంచా కాల్చుతూ స్వీట్లు పంపిణీ చేసుకొని సంబురాలు జరుపుకున్నారు.

# జాతీయ ఆరోగ్య మిషన్ కరదీపిక ఆవిష్కరణ



**ములుగు, మహా :** ములుగు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఆరోగ్యం, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ, జాతీయ ఆరోగ్య మిషన్, ప్రజారోగ్యం కుటుంబ సంక్షేమంపై పీహెచ్ సీ అధికారుల కరదీపికను ములుగు జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ దివాకర్ టీఎస్ గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ కరదీపిక గ్రామీణ స్థాయిలో పనిచేసే ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలకు దోహదపడుతుందని తెలిపారు. కరదీపికలోని అంశాలను ప్రజలకు అవగాహన, ప్రత్యేక కార్యక్రమాల ద్వారా తెలిపి వారి ఆరోగ్యాన్ని పెంపొందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మహేందర్ జీ, డీఎంహెచ్వో డాక్టర్ గోపాలరావు, ఇన్చార్జి డెమో సంపత్ పాల్గొన్నారు.

# ఘనంగా నవగ్రహ విగ్రహ ప్రతిష్టాపన



**ములుగు, మహా:** ములుగు మండలం బండారుపల్లి గ్రామంలోని సీతారామాంజనేయస్వామి ఆలయంలో గురువారం నవగ్రహ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం వైభవంగా జరిగింది. గ్రామంలో గత ఆరు నెలల క్రితం నిర్మించి కొలువుదీర్చిన రామాలయంలో దేవతా మూర్తులను ప్రతిష్ఠించగా ఆలయ కమిటీ చైర్మన్ అక్కల రవి ఆధ్వర్యంలో నవగ్రహ విగ్రహాలను ప్రతిష్ఠించారు. వేద పండితులు సముద్రాల శ్రీనివాసాచార్యుల బృందం ఆధ్వర్యంలో గ్రామస్తులు మూడు రోజులుగా ప్రత్యేక పూజలు, అభిశేకాలు నిర్వహించారు. చివరి రోజున నవగ్రహ విగ్రహాలను ప్రతిష్ఠించారు. గ్రామస్తులు భారీ సంఖ్యలో హాజరై నవగ్రహాలకు పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రామాలయ నిర్మాణ కమిటీ సభ్యులు మాజీ సర్పంచ్ అక్కల రఘోత్తం, బుద్దె వీరన్న, బస్వోజు మొగిళి, కొండి సాంబశివ, చంద్రగిరి కుమార్ గౌడ్, అప్పని వీరస్వామి, పెండెం భిక్షపతి, కంచరకుంట్ల రవీందర్ రెడ్డి, సంకటి మల్లయ్య, అలువాల రాజ్ కుమార్, రామాలయ ప్రధాన పూజారి బుసిగొండ రవీందర్, గ్రామపెద్దలు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ నియంత్రణపై విస్తృత అవగాహన కార్యక్రమాలు



**ఖమ్మం, నవంబర్ 28, మహా:** జిల్లాలో మాదకద్రవ్యాలు, డ్రగ్స్ నియంత్రణ ప్రాధాన్యత అంశంగా అధికారులు పని చేయాలని, ఈ దిశగా అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజతో కలిసి కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో మాదక ద్రవ్యాలు, డ్రగ్స్ నియంత్రణపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాబోయే 3 నెలల పాటు డ్రగ్స్, మాదకద్రవ్యాల నియంత్రణ, వీటి వల్ల కలిగే దుష్పరిణామాలపై విస్తృత ప్రచారం నిర్వహించుటకు ప్రాధాన్యతనిస్తూ కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. ప్రతి మండలంలో బృందాలు ఏర్పాటు చేస్తూ, వారానికి 2 విద్యా సంస్థలను సందర్శిస్తూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా విద్యా శాఖ అధికారి సోమశేఖర శర్మ, రాంగోపాల్ రెడ్డి, మధిర షేర్ ఎన్.జి.ఓ. డైరెక్టర్ జి. గోపాల్ రెడ్డి, కౌన్సిలర్ లు గోపాల్ స్వామి, ఎం. హనుమంతరావు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



**ముదిగొండ, నవంబర్ 28, మహా :** ప్రజా పాలన ప్రజా విజయోత్సవాల్లో భాగంగా జిల్లా పరిషత్ ముదిగొండ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి వ్యాస, రూప పోటీలను గురువారం నిర్వహించారు. ఈ పోటీల్లో మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు. ఈ వ్యాసరచన పోటీల్లో ప్రథమ బహుమతి కమలాపురం సాయిమెరిట్ పాఠశాలకు చెందిన కె దివ్య (9వ తరగతి), ద్వితీయ బహుమతి ముదిగొండ హైస్కూల్ కు చెందిన కొత్తపల్లి తేజశ్రీ (పదవ తరగతి) అందుకున్నారు. గెలుపొందిన విజేతలకు మండల విద్యాశాఖ అధికారి డి రమణయ్య బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ముదిగొండ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శాంతి, కాంప్లెక్స్ సీఆర్పీ వీరయ్య, సాయిమెరిట్ పాఠశాల కరస్పాండెంట్ కందుల శంకరయ్య, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కార్మికుల పొట్టకొడితే చూస్తూ ఊరుకోం




**మధిర, నవంబర్ 28, మహా:** అక్రమ ఇసుక రావాణా పేరుతో ఇసుక తోలకాలను నిలిపివేస్తూ నిర్మాణరంగంలో పనిచేస్తున్న కార్మికుల పొట్ట కొడుతుంటే చూస్తూ ఊరుకునేది లేదు అని సీపీఐ పట్టణ కార్యదర్శి బెజవాడ రవిబాబు పేర్కొన్నారు. గత కొద్ది రోజులుగా పట్టణంలో పూర్తిగా ఇసుక రవాణా నిలిచిపోవడంతో ప్రభుత్వ అధికారుల తీరును నిరసిస్తూ ఆయన ఓ ప్రకటనను విడుదల చేశారు. పట్టణంలో నిర్మాణ రంగంపై ఆధారపడి వందలాదిమంది భవన నిర్మాణ కార్మికులు పనిచేస్తూ వారి కుటుంబాలను పోషించుకుంటూ జీవనం సాగిస్తున్నారని, ప్రతి నిర్మాణంలో కావాల్సింది ప్రధానంగా ఇసుక, అటువంటి ఇసుకను అధికారులు నిలివేయడంతో నిర్మాణరంగం తీవ్ర సంక్షోభం ఎదుర్కోవడమే కాకుండా ఆ రంగం మీద ఆధారపడి జీవించే కుటుంబాలు వీధినపడాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అన్నీ ఉన్నా అల్లుడినోట్లో శని అన్న చందంగా ప్రక్కనే మధిర ఏటిలో పుష్కలంగా ఇసుక లభ్యత ఉన్నా స్థానిక అధికారులు మాత్రం ఆమాత్యుల సూచన పేరుతోనో లేకపోతే పెద్ద బాసుల ఆదేశాల పేరుతోనో ఈ మధ్యన మధిరలో ఇసుక తోలకాలను నిలుపుదల చేయడం వల్ల ఇసుక దొరకకుండా చేస్తూ రోజు కూలీలుగా ఉన్న నిరుపేదలైన భవన నిర్మాణ కార్మికుల పొట్ట కొడుతున్నారన్నారు.

# తొలి సామాజిక విప్లవకారుడు పూలే



**బోనకల్, నవంబర్ 28, మహా:** స్థానిక మండల కేంద్రంలోని వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరవీరుల భవనంలో మహాత్మ జ్యోతిరావు పూలే 134వ వర్థంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. తొలుతగా జ్యోతిరావు పూలే చిత్రపటానికి సీపీఎం పార్టీ మండల కార్యదర్శి కిలారి సురేష్ పూలమాలు వేసి నివాళులు అర్పించారు. అనంతం కిలారి సురేష్ మాట్లడుతూ భారతదేశంలో అక్షర జ్ఞానం అందరికీ కావాలని ఆకాంక్షించిన తొలి సామాజిక విప్లవకారుడు జ్యోతిరావు పూలే అన్నారు. భార్య సావిత్రిబాయ్ కి చదువు చెప్పించి, ఆమెను తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా చేసిన ఘనత జ్యోతిరావు పూలేకి దక్కిందన్నారు. పందొమ్మిదవ శతాబ్దపు సంఘ సంస్కర్తల్లో రైతుల గురించి పోరాడిన ఏకైక సంస్కర్త జ్యోతిరావు పూలే అని, ఆనాటి రైతు సమస్యలను బ్రిటీష్ పాలకుల దృష్టికి తెచ్చి వాటి పరిష్కారానికి పూలే పలు చర్యలు సూచించారని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల ప్రధాన కార్యదర్శి బంధం శ్రీనివాసరావు, సీపీఎం పార్టీ మండల కమిటీ సభ్యులు తెల్లాకుల శ్రీనివాసరావు, గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పంతులు, కేవీపీఎస్ నాయకులు బాబు, మండల కమిటీ సభ్యులు నరేష్, బంక శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# డేటా ఎంట్రీ తప్పిదాలు లేకుండా జరిగేనా..?



**బోనకల్, నవంబర్ 29, మహా:** కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన అనంతరం ప్రజా పాలన కార్యక్రమం ద్వారా ఆరు గ్యారెంటీలను అర్హత కలిగిన లబ్ధిదారులకు అందించేందుకు దరఖాస్తులను రాష్ట్ర వ్యాప్తంగా ఆయా గ్రామాలలో అధికారుల ఆధ్వర్యంలో ప్రత్యేక కౌంటర్ల ద్వారా దరఖాస్తులను తీసుకుంది. గ్రామ ప్రజలు తమకు కావాల్సిన పథకాలకు కూలంకషంగా దరఖాస్తులు నింపి అధికారులకు అందజేశారు. ఇంతవరకు బాగానే ఉన్నా గ్రామ స్థాయి నుండి మండల కేంద్రానికి దరఖాస్తులు చేరుకొన్న అనంతరం సేకరించిన వివరాలను ప్రభుత్వం ఆన్లైన్ లో నమోదపరచవలసిందిగా అధికారులు ఆదేశించడంతో అప్పటికప్పుడు అధికారులు హడావిడి చేసి కంప్యూటర్ ద్వారా డేటాను ఎంట్రీ చేసేందుకు పలువురు ప్రైవేటు వ్యక్తులను తీసుకుని డేటాను నమోదు చేసే క్రమంలో ఆపరేటర్లు చేసిన తప్పిదాల వల్ల ఆయా గ్రామాల్లో కొంతమంది పేద ప్రజలు వారికి అందాల్సిన పథకాలు ఆపరేటర్ల తప్పిదంతో అందుకోలేకపోయారు. సబ్సిడీ పథకాలు పొందేందుకు నెలలు తరబడి కార్యాలయాలు చుట్టూ తిరిగినా అధికారులు తమ చేతుల్లో ఏమీలేదని, ప్రభుత్వం మళ్లీ అవకాశం ఇచ్చేవరకు వేచి చూడాలని చేతులు దులిపేసుకున్నారన్నారు. అది జరిగి సుమారు ఏడేనిమిది నెలలు గడవకముందే, ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ అమలపరిచేందుకు తెరపైకి తీసుకువచ్చిన సమగ్ర కుటుంబ సర్వేను అన్ని గ్రామాల్లో ప్రతిష్టాత్మంగా చేపట్టింది. ఈ సర్వేలో ప్రముఖంగా కుటుంబ, ఆర్థిక, రాజకీయ, విద్య, ఉపాధి అవకాశాలను సేకరిస్తూ ప్రభుత్వం ద్వారా గతంలో లబ్ధి పొందారా లేదా? తదితర అంశాలను ఎన్యుమరేటర్ ద్వారా డేటా షీట్ లో నమోదు పరిచారు. ఆ తదుపరి సేకరించిన డేటాను చేయాల్సిందిగా గడువు విధించడంతో అధికారులు మళ్లీ యథావిధిగా ప్రైవేటు ఆపరేటర్లను తీసుకొని డేటాను వారి ద్వారా ఆన్ లైన్ చేయిస్తున్నారు. దీనికి గతంలో ఆపరేటర్లు చేసిన తప్పిదం వలన పేద ప్రజలకు అందవలసిన ఉచిత గ్యాస్, ఉచిత కరెంట్ సబ్సిడీలు ఆన్ లైన్ లో నమోదు చేయకపోవడం వలన అర్హత కలిగిన లబ్ధిదారులు ప్రభుత్వ పథకాలు అందుకోలేకపోయామని మండల ప్రజలు వాపోతున్నారు. ప్రస్తుతం సమగ్ర కుటుంబ సర్వే ఆన్ లైన్ ప్రక్రియ జరుగుతుందని, ఇప్పటికైనా అధికారులు గతంలో జరిగిన తప్పిదాలను దృష్టిలో పెట్టుకొని ఈ ప్రక్రియను సమర్థవంతంగా, ఎలాంటి తప్పులు లేకుండా జరిగేలా కృషిచేసి లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందేవిధంగా చొరవ చూపాలని మండల ప్రజలతోపాటు పలు రాజకీయ పార్టీల నాయకులు అధికారులను కోరుతున్నారు.

### అధికారుల తప్పిదం వల్లే బిల్లు కడుతున్న : నంబూరు వెంకటేశ్వర్లు

మండల పరిధిలోని నారాయణపురం గ్రామానికి చెందిన నంబూరు వెంకటేశ్వర్లు ప్రజా పాలన ద్వారా ఉచిత కరెంటు పథకానికి దరఖాస్తు చేసుకున్నాడు. కానీ అధికారులు చేసిన తప్పిదం వల్ల తనకి సంవత్సరం నుంచి ఉచిత కరెంటు అమలు కావడం లేదని బిల్ కడుతూనే ఉన్నానని, ఈ విషయమై అధికారులను అడిగినా తాము చేసేదేంలేదని చెబుతున్నారని పేర్కొన్నాడు.

# ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి




**ములుగు, మహా:** జిల్లాలోని నిరుద్యోగ యువకులు ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఇన్చార్జి ఎంప్లాయిమెంట్ అధికారి తుల రవి సూచించారు. అపోలో ఫార్మసీ సౌజన్యంతో ములుగులోని జిల్లా సంక్షేమ భవన్ లో గురువారం నిర్వహించిన జాబ్ మేళా కార్యక్రమానికి 28మంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకున్నారని రవి తెలిపారు. అందులో అర్హులైన నలుగురికి నియామకపత్రాలు అందజేశారని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలతోపాటు అర్హతలకు తగ్గట్టు అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని పిలుపునిచ్చారు. జిల్లాలోని ఏజెన్సీ ప్రాంత యువత నోటిఫికేషన్లకు స్పందించాలన్నారు. అదేవిధంగా అర్హత కలిగినవారు అపోలో ఫార్మసీలో ఉద్యోగాల కోసం జిల్లా ఉపాధి కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంటే ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామని అపోలో ఫార్మసీ హెచ్ఆర్ రఘుపతి తెలిపారు. హన్మకొండ జిల్లా ఉపాధి శాఖ అధికారి ఎం.మల్లయ్య, రీజినల్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

# యాగశాలను సందర్శించిన ఎంపీ వద్దిరాజు



**ఖమ్మం, నవంబర్ 28, మహా:** రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ఖమ్మం మమత రోడ్డులో ఎస్బీఐటీ సమీపంలో ఉన్న సహస్ర చండీ సహిత మహా రుద్ర యాగశాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ బండ్ల మాంబ రాజమాత ఆశీస్సులతో సహస్ర చండీ సహిత వారాహి, ప్రత్యంగిరా, బగళా, శ్రీవిద్యా పూర్వక మహా రుద్రయాగం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర గురువారం యాగశాలను సందర్శించి హోమ గుండాలకు భక్తి శ్రద్ధలతో నమస్కరించారు. ఎంపీ రవిచంద్ర కూతురుఅల్లుడు డాక్టర్ గంగుల గంగాభవానీ గంగుల సందీప్ లు కూడా ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితులు వారికి ఆశీర్వచనాలు చేసి, తీర్థ ప్రసాదాలు అందించారు.

# కేంద్ర పెద్దలను కలిసి సమస్యలను పరిష్కరించుకుంటాం

■ ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి

**ఖమ్మం, నవంబర్ 28, మహా:** రాష్ట్రంలో ప్రధాన సమస్యల పరిష్కారం కోసం కేంద్ర ప్రభుత్వ పెద్దలను కలుస్తామని ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి అన్నారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్ లో కాంగ్రెస్ ఎంపీలు మల్లు రవి, కడియం కావ్య.. తదితరులతో కలిసి గురువారం మీడియా సమావేశంలో మాట్లాడారు. ఇటీవల కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కలిశానన్నారు. దక్షిణ మధ్య రైల్వేకు సంబంధించి కేంద్ర రైల్వే మంత్రిని కూడా కలిసి సమస్యలను పరిష్కరించుకుంటామని అన్నారు.



ఎన్నికల వరకే రాజకీయాలు అని.. ఆ తర్వాత రాష్ట్ర ప్రజల శ్రేయస్సు, తమ పరిధిలోని ప్రాంతాల అభివృద్ధినే ప్రధాన లక్ష్యమని ప్రకటించారు.

# ఆదివాసీ ప్రాంతాల్లో వంటగ్యాస్ వెతలకు పరిష్కారమేంటి..?

■ ఇటీవల వంట నూనెల ధరలు పెరగడానికి కారణాలేంటి?

■ లోక్ సభలో ప్రశ్నించిన ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాంరెడ్డి



**ఖమ్మం, నవంబర్ 28, మహా:** సుదూర ప్రాంతాల్లోని కొండా కోనల్లో నివసిస్తున్న ఆదివాసీ, గిరిజనులకు వంట గ్యాస్ సౌకర్యం కల్పించడం, తిరిగి సిలిండర్లలో ఎల్ పీజీ గ్యాస్ నింపించుకునేందుకు పడుతున్న కష్టాలకు పరిష్కార చర్యలు ఏం తీసుకుంటున్నారని ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాంరెడ్డి లోక్ సభలో గురువారం ప్రశ్నించారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాల సందర్భంగా ఈ మేరకు ప్రశ్నను సంధిస్తూ.. ప్రధాన మంత్రి ఉజ్వల యోజన (పీఎంయూవై) పథకం ద్వారా గిరిజనులకు ఏ మేరకు లబ్ధి చేకూరిందని అడిగారు. దీనికి కేంద్ర పెట్రోలియం, సహజవాయువులు, పర్యాటక శాఖల సహాయ మంత్రి సురేష్ గోపి లిఖితపూర్వకంగా సమాధానమిచ్చారు. 2016లో ఈ పథకం ప్రారంభించబడిందని.. వృద్ధ మహిళలు, ప్రత్యేకంగా తెలంగాణ రాష్ట్రంలోని ఆదివాసీ ప్రాంతాల వారికి వంట గ్యాస్ సౌకర్యం కల్పించడం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ ఏడాది నవంబర్ 1 నాటికి ఉజ్వల యోజన ద్వారా దేశంలో 3.13 కోట్ల కనెక్షన్లు ఇవ్వగా..ఇందులో తెలంగాణలో మొత్తం 11.85 లక్షల మంది ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చినట్లు వివరించారు. తెలంగాణలో జిల్లాల వారీగా గణాంకాలను వెల్లడించగా, ఇందులో ఖమ్మంలో 83,176 కనెక్షన్లు, భద్రాద్రి కొత్తగూడెంలో 71,556 మందికి లబ్ధి చేకూరినట్లు తెలిపారు. వీరి సౌకర్యార్థం గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ షిప్ ల ద్వారా ఎల్ పీజీ రీ ఫిల్లింగ్ వేగిరం చేశామని, సబ్సిడీని కొనసాగిస్తున్నామని తెలిపారు. అర్హులందరికీ లబ్ధి చేకూరేలా సామూహిక అవగాహన శిబిరాలతో చైతన్య పరుస్తున్నామని వివరించారు.

**వంట నూనె ధరల పెంపుతో సామాన్యులపై భారం..**

ఇటీవల దేశంలో వంట నూనెల ధరలు పెరగడానికి కారణమైన అంశాలను కేంద్ర ప్రభుత్వం గుర్తించిందా..? అని ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి లోక్ సభలో ప్రశ్నించారు. వంట నూనెల ధరల పెంపుతో సామాన్యులు, చిరు వ్యాపారులపై భారం పడుతోందని పేర్కొన్నారు. దీనికి గాను.. కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ప్రజా పంపిణీ శాఖల సహాయ మంత్రి నిముబెన్ జయంతి భాయ్ బంభానియా లిఖితపూర్వక సమాధానమిచ్చారు. వంట నూనెల దేశీయ ఉత్పత్తి 57శాతం తగ్గిందని, దిగుమతుల కారణంగా ధరలు పెరిగాయని తెలిపారు. అంతర్జాతీయ, దేశీయ ధరలను కేంద్ర ప్రభుత్వం నిశితంగా పర్యవేక్షిస్తోందని చెప్పారు. నూనె గింజల ఉత్పత్తిని ప్రోత్సహించేందుకు వివిధ ఎడిబుల్ ఆయిల్ లపై బేసిక్ కస్టమ్స్ డ్యూటీ (బీసీడీ)ని రైతులకు అనుకూలంగా మార్చినట్లు తెలిపారు. వినియోగదారులు, రైతులు, వంటనూనె పరిశ్రమల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని.. ధరలు అందుబాటులోకి తెచ్చేందుకు విధానపరమైన చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

# రైతుల ఖాతాల్లోకి బోనస్

▪ఆనందం వ్యక్తం చేస్తున్నరైతన్నలు

**కల్లూరు, నవంబర్ 28, మహా:** రాష్ట్ర ప్రజలందరికీ సన్నరకం బియ్యం అందించాలనే సదుద్దేశంతో రైతులు సన్నరకం వడ్లను పండించేందుకు ప్రోత్సాహంగా క్వింటాకు 500 రూ.లు బోనస్ ఇస్తానని చెప్పడం, ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం రైతుల ఖాతాల్లో మూడు రోజుల్లోనే బోనస్ జమ చేయడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఏనుగు సత్యంబాబు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొన్నటివరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు, రైస్ మిల్లర్ల చుట్టూ రైతులు తిరిగారని.. ఇప్పుడు రైతుల దగ్గరికే వ్యాపారులు వచ్చే పరిస్థితి నెలకొన్నదని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వడ్లు అమ్మిన రైతులకు ప్రభుత్వం రూ.500కు బోనస్ ఇస్తుండడంతో మిల్లర్లు, వ్యాపారులు అంతకుమించి రేటు పెట్టేందుకు ముందుకొస్తున్నారని అన్నారు. గతంలో తేమశాతాన్ని అడ్డం పెట్టుకొని మద్దతు ధరకు తక్కువగా కొనుగోలు చేసి మిల్లర్లు రైతులను ఇబ్బంది పెట్టారని అన్నారు. దళారీ వ్యవస్థను నిర్మూలించేందుకు బోనస్ పొందేవిధంగా కృషి చేయాల్సిన బీఆర్ఎస్ నాయకులు రైతులను తప్పు దోవ పట్టించారని అన్నారు.



**ఆనందమే కదా..!: రైతు దేవరపల్లి వెంకటేశ్వరరావు**

రేవంత్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారమే ఆన్ లైన్ చేసిన మూడు రోజుల్లో గిట్టుబాటు ధర, మరో 2,3 రోజుల్లో బోనస్ ఇస్తుండడంతో రైతులకు ఆనందమే కదా..!.నాకు బోనస్సే 5 ఎకరాలకు 132 క్వింటాల 80 కేజీలకు గాను 66,400 రూ.లు వచ్చాయి. రైతుల పక్షాన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం.

**యాసంగి పంటకు పెట్టుబడిగా బోనస్ : మట్టూరి స్టాలిన్**

రైతు గతంలో ధాన్యం విక్రయిస్తే సకాలంలో డబ్బులు జమ అయ్యేవికాదని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మూడు రోజుల్లోనే నా ఖాతాలో గిట్టుబాటు ధర 12 ఎకరాలకి 6, 91,360 రూపాయలు, బోనస్ 298 క్వింటాలకు రూ. 1,49,000 బోనస్ జమ చేసింది. ప్రస్తుతం యాసంగి పంటకు పెట్టుబడి సహాయంగా బోనస్ డబ్బులు ఉపయోగపడుతున్నాయి.

# డేటా ఎంట్రీని త్వరితగతిన పూర్తి చేయాలి

- కొత్తగూడెం కలెక్టర్ జితేష్ వి పాటిల్



**కొత్తగూడెం, నవంబర్ 28, మహా:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే డేటా ఎంట్రీ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. గురువారం అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు విద్యా చందనతో కలిసి జిల్లాలోని ఆర్డీవోలు, జిల్లా అధికారులు, తహశీల్దార్లతో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే డేటా ఎంట్రీ, డబుల్ బెడ్ రూమ్ ఇల్లు, పోడు భూములు, ఇంటిగ్రేటెడ్ పాఠశాలల స్థల గుర్తింపు తదితర అంశాలపై కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే డేటా ఎంట్రీ ప్రక్రియను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. దానికిగాను ఆసక్తిగల, ఉత్సాహవంతులైన యువతీయువకులను డేటా ఎంట్రీ చేయడానికి నియమించుకోవాలన్నారు. తహశీల్దార్లు తమ పరిధిలోని పాఠశాలలు, కళాశాలల్లో కంప్యూటర్ ల్యాబ్ లను ఉపయోగించుకోవాలన్నారు.

# ఖమ్మంలో ప్రైవేట్ ఆసుపత్రుల్లో అధికారుల తనిఖీలు

■ రెండు హాస్పిటల్స్ సీజ్

■ మెడికల్ ప్రాక్టీస్ సిబ్బందిపై కేసులు నమోదు

**ఖమ్మం, నవంబర్ 28, మహా:** నగరంలో నకిలీ డాక్టర్లపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు కొరడా ఝులిపించారు. గురువారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారుల ఆధ్వర్యంలో అనుమతి లేని ఆసుపత్రులపై విస్తృత స్థాయి తనిఖీలు నిర్వహించారు. అనుమతులు లేకుండా నడుస్తున్న ఆసుపత్రులపై అధికారులు కఠిన చర్యలు తీసుకున్నారు. తనిఖీల సమయంలో అనేక ఆసుపత్రుల్లో నిబంధనలకు విరుద్ధంగా వైద్య సేవలు నిర్వహిస్తున్నట్లు వెల్లడైంది. డాక్టర్ సయ్యద్ నేతృత్వంలో నిర్వహించిన ఈ తనిఖీల్లో అనుమతులు లేని ఆసుపత్రులు, నకిలీ మెడికల్ పరికరాలు, తగిన అర్హతలు లేని సిబ్బంది వాడుక వంటి అంశాలు వెలుగులోకి వచ్చాయి. స్థానిక కొత్త బస్టాండ్ సమీపంలో గల అజెయ్ ఆర్.ఎం.పి. ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసి, అక్కడ (6) బెడ్స్ ను ఏర్పాటు చేసి ఇష్టారీతిన వచ్చిరాని వైద్యాన్ని అందించటం జరుగుతుందని గమనించి సీజ్ చేశారు. పక్కనే ఉన్న మెడికల్ షాప్ నందు మందులను పరిశీలించి సీరియస్ అయ్యారు. అదేవిధంగా మయూరి ఆసుపత్రిలో అబార్షన్లు జరుగుతున్నాయనే ఫిర్యాదు రావడంతో తనిఖీలు నిర్వహించారు. ఆపరేషన్ థియేటర్, ల్యాబ్, మందుల షాప్ లను తనిఖీ చేశారు. పీజీ చెయ్యకుండానే బోర్డు ఎలా పెడతారని హెచ్చరించారు. సంజాయిషీ కొరకు ఆదేశించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. జిల్లాలో గల ప్రైవేట్ ఆసుపత్రులను నియమ నిబంధనలు పాటిస్తూ నడపాలన్నారు. అనవసర టెస్టులు, ఇబ్బడి ముబ్బడిగా మందులు, చికిత్సలు అందిస్తున్నారని ప్రజల నుండి కంప్లైంట్స్ వస్తున్నాయని, ఈ తీరు మారాలని అన్నారు. ధనార్జనే ధ్యేయంగా ప్రైవేట్ ఆసుపత్రులు నడపటం మంచిది కాదని, మంచి సేవలు అందించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటంలో సహకరించాలని చెప్పారు. ఈ తనిఖీల్లో డాక్టర్ సయ్యద్, పీఓ డాక్టర్ సుధాకర్, డాక్టర్ రామారావు, సంజయ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణ ఉద్యమానికి దీక్షా దివస్ ఊపిరి పోసింది : నామా




**ఖమ్మం, నవంబర్ 28, మహా:** మలి దశ తెలంగాణ ఉద్యమంలో 29 నవంబర్, 2009 తెలంగాణ చరిత్రలో లిఖించదగిన రోజు అని బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు అన్నారు. ఆ రోజున ఉద్యమ నేతగా కేసీఆర్ చేపట్టిన "దీక్షా దివస్" ఉద్యమాన్ని మలుపు తిప్పిందన్నారు. రాష్ట్ర సాధన ధ్యేయంతో ఆమరణ నిరాహార దీక్షకు దిగిన కేసీఆర్, "తెలంగాణ వచ్చుడో కేసీఆర్ సచ్చుడో" అంటూ నినాదంతో ఉద్యమ స్ఫూర్తిని రగిలించిన ఘనత వారిదన్నారు. తెలంగాణ ప్రజల్ని ఐక్యం చేసి ఏకతాటి పైకి తీసుకువచ్చిన తెలంగాణ ఉద్యమ సారధి కేసీఆర్, రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవాన్ని నిలబెట్టి నేటితో ఉద్యమ విజయానికి పదిహేనేండ్లు పూర్తయిందన్నారు. మహాత్మ గాంధీ స్ఫూర్తితో గల్లీ నుండి ఢిల్లీ వరకు ప్రజలను కదిలించి, ఢిల్లీ మెడలు వంచి తెలంగాణ సాధించిన కేసీఆర్‌ను ఆయన కొనియాడారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కొరకు నాడు తెలంగాణ విద్యార్థి లోకం, ఉద్యమకారులు, ఉద్యోగులు, అమరులు నిరంతరం తమ వాణిని వినిపించారన్నారు. 15వ లోక్‌సభలో తెలంగాణ బిల్లు ప్రవేశపెట్టినపుడు, తాను ఎంపీగా ఉండి తెలంగాణ బిడ్డగా తొలి ఓటు వేశానన్నారు. దీక్ష దివస్ సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు జరిగే కార్యక్రమాల్లో నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని ఉద్యమ స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లాలని కోరారు.

# పూలేకు నివాళులర్పించిన బీఆర్ఎస్ నేతలు



**ఖమ్మం, నవంబర్ 28, మహా:** రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ఎమ్మెల్సీ తాతా మధుతో కలిసి సామాజిక విప్లవకారుడు,సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. పూలే 134వ వర్ధంతి సందర్భంగా ఖమ్మంలోని తెలంగాణ భవన్ లో గురువారం ఉదయం జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చంద్రావతి తదితర బీఆర్ఎస్ ప్రముఖులతోపాటు వీరు కూడా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శీలంశెట్టి వీరభద్రం, ఉప్పల వెంకట రమణ, బొమ్మెర రాంమూర్తి, బెల్లం వేణు, తోట వీరభద్రం, పగడాల నరేందర్, డోకుపర్తి సుబ్బారావు, బిచ్చాల తిరుమల రావు, ఖమర్, లింగనబోయిన సతీష్, బీరెడ్డి నాగచంద్రారెడ్డి తదితరులు పూలే చిత్రపటానికి పూలుజల్లి నివాళులర్పించారు. ఈ సందర్భంగా "అమర్ హై అమర్ హై మహాత్మా జ్యోతిరావు పూలే అమర్ హై", "సాధిద్దాం సాధిద్దాం పూలే ఆశయాలు సాధిద్దాం", "జై తెలంగాణ జైజై తెలంగాణ"అంటూ నినదించారు.

# గురుకుల విద్యాలయాన్ని తనిఖీ చేసిన కలెక్టర్



**కొత్తగూడెం / సుజాతనగర్, నవంబర్ 28, మహా:** సుజాతనగర్ వేపలగడ్డలోని బాలుర గురుకుల విద్యాలయాన్ని జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ గురువారం అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యాలయ ప్రాంగణం, వంట గదులు, విద్యార్థులకు అందించే భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు తాత్కాలిక భవనంలో గురుకుల విద్యాలయాన్ని ఏర్పాటు చేశామని, పక్కా గృహం చేపట్టాలని కలెక్టర్ కు తెలుపగా వారంరోజుల్లో గురుకుల విద్యాలయానికి బిల్డింగ్ తోపాటు కావాలసిన ఇతర సదుపాయాల ప్రతిపాదనలను సమర్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని సూచించారు. పౌష్టికరమైన ఆహారాన్ని తీసుకోవడం వల్ల విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. అనంతరం సుజాతనగర్ లోని జిన్నింగ్ మిల్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పత్తిలో తేమశాతం, ధర, కొనుగోలు విధానాల గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రైతులకు అధికారులు సమకూరుస్తున్న వసతులను అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ నాగరాజు, గురుకుల విద్యాలయ ప్రిన్సిపాల్ బ్యూలారాణి, ఏవో నర్మద, రైతులు పాల్గొన్నారు.

# హాస్టల్ విద్యార్థినులకు స్వెటర్లు పంపిణీ



**కొత్తగూడెం, నవంబర్ 28, మహా:** చుంచుపల్లి మండలంలోని ఎస్సీ బాలికల ప్రీ మెట్రిక్ వసతి గృహాన్ని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ గురువారం సాయంత్రం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో కలిసి భోజనం చేసి, అనంతరం వారికి స్వెటర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చలి తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో విద్యార్థినులకు రక్షణ కోసం స్వెటర్లను అందజేయడం జరిగిందన్నారు. హాస్టల్ లో ఉండే విద్యార్థినులకు మెనూ ప్రకారం ఆహారం అందించాలని వార్డెన్ కు సూచించారు. హాస్టల్ విద్యార్థులు ప్రణాళికా బద్ధంగా చదువుతూ ఉత్తమ ఫలితాలను సాధించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ వెల్ఫేర్ అధికారి అనసూయ, హాస్టల్ వార్డెన్, సిబ్బంది పాల్గొన్నారు.

# 6న జిల్లాలో మంత్రి దామోదర పర్యటన

**ఖమ్మం, నవంబర్ 28, మహా:** డిసెంబర్ 6న జిల్లాకు రానున్న వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి పర్యటనకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్, కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో డిసెంబర్ 6న జిల్లాలో జరిగే వైద్యారోగ్య శాఖ మంత్రి పర్యటనకు సంబంధించి చేయాల్సిన ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. వైద్యాధికారులు, వివిధ విభాగాల సిబ్బందితో మంత్రి ఇంటరాక్ట్ అవుతారని కలెక్టర్ తెలిపారు. వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి ఖమ్మం జిల్లాకు చేరుకొని జిల్లా ఆసుపత్రి , మాతా శిశు సంరక్షణ కేంద్రం సందర్శిస్తారని అన్నారు. సమీక్ష తర్వాత భోజన విరామం అనంతరం మంత్రి వైద్య కళాశాల నిర్మాణ స్థలం వద్దకు వెళ్లడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎస్. రాజేశ్వర రావు, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిణి డా. కళావతి బాయి, డీసీహెచ్ఎస్ డా. రాజశేఖర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన వైరా ఎమ్మెల్యే

**వైరా, నవంబర్ 28 , మహా:** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని వైరా ఎమ్మెల్యే మాలోతు రామదాస్ నాయక్ గురువారం కలిశారు. తెలంగాణ రాష్ట్రంలోని వివిధ గిరిజన ప్రజల సమస్యల్ని ఎమ్మెల్యే రాందాస్ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. ముఖ్యమంత్రిని కలిసినవారిలో గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షులు శరత్ నాయక్, గిరిజన శక్తి వ్యవస్థాపకులు డా. వెంకటేష్ చౌహన్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సుబ్బు నాయక్, రాష్ట్ర చీఫ్ కోఆర్డినేటర్ రమేష్ రాథోడ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు రవి నాయక్, మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్,తదితరులు ఉన్నారు.



# నేడు ఉ. 11 గంటలకు పోటు ప్రసాద్ అంతిమ యాత్ర

**ఖమ్మం , నవంబర్ 28, మహా:** దివంగత సీపీఐ నేత, కమ్యూనిస్టు పార్టీ ఖమ్మం జిల్లా ఉద్యమ సారధి పోటు ప్రసాద్ సంతాప సభ శుక్రవారం ఉదయం 9.30 గంటలకు సీపీఐ కార్యాలయంలో జరుగుతుందని జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ తెలిపారు. ఉదయం తొమ్మిది గంటలకు ప్రసాద్ మృతదేహాన్ని పార్టీ కార్యాలయంలో ప్రజల సందర్శనార్థం ఉంచుతారన్నారు. సంతాప సభలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు సహా రాష్ట్ర, జిల్లా నాయకులు, వివిధ రాజకీయ పక్షాల నేతలు పాల్గొంటారన్నారు. 11 గంటలకు పార్టీ కార్యాలయం నుంచి అంతిమ యాత్ర ప్రారంభమవుతుందని ఆయన తెలిపారు. సీపీఐ కార్యాలయం నుండి బైపాస్ రోడ్డు ఎన్టీఆర్ సర్కిల్, ఐటీ హబ్ సెంటర్, మమత రోడ్డు మీదుగా అంతిమ యాత్ర మమత ఆసుపత్రికి చేరుకుంటుందని సురేష్ తెలిపారు. ప్రసాద్ మృతదేహాన్ని కుటుంబ సభ్యులు వైద్య పరీక్షల నిమిత్తం మమత ఆసుపత్రికి బహూకరించారన్నారు. కమ్యూనిస్టు శ్రేణులు, ప్రసాద్ అభిమానులు పాల్గొని ప్రసాద్ కు కడసారి నివాళులర్పించాల్సిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు.




# ఖమ్మంలో విద్యార్థుల ధర్నా



**ఖమ్మం సిటీ, నవంబర్ 28, మహా :** నగరంలోని ఎన్ఎస్పీ పాఠశాలలో మధ్యాహ్న భోజనంలో నీళ్లతో కూడిన చారు, ఉడకని సోరకాయ కూర వడ్డిస్తున్నారంటూ విద్యార్థులు ధర్నా నిర్వహించారు. పీడీఎస్ యూ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులు ధర్నా చేశారు. స్పందించిన జిల్లా విద్యాశాఖ అధికారి సోమా శేఖర్ శర్మ స్కూల్ దగ్గరకు వచ్చి ఇక నుంచి సరైన విధంగా అన్నం వడ్డించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. విద్యార్థుల ధర్నాలో వెంకటేష్, సాయి, అనిల్, అఖిల్, సంతోష్,ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

# అన్న క్యాంటీన్ ను సందర్శించిన ఎంపీ వద్దిరాజు



**ఖమ్మం, నవంబర్ 28, మహా:** ఎమ్మెల్సీ తాతా మధుతో కలిసి ఖమ్మం కాల్వొడ్డు హనుమాన్ ఆలయం వద్ద ఉన్న అన్న క్యాంటీన్ రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర సందర్శించారు. ప్రముఖ సినీ హీరో నందమూరి బాలకృష్ణ సేవా సమితి నాయకుడు నల్లమల రంజిత్ 62రోజులుగా 5రూపాయలకే మధ్యాహ్న భోజనం అందిస్తున్న విషయం తెలిసి గురువారం అన్న క్యాంటీన్ ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర, ఎమ్మెల్సీ మధు తదితర ప్రముఖులు స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆ తర్వాత బీఆర్ఎస్ నాయకులు శీలంశెట్టి వీరభద్రం, బొమ్మెర రాంమూర్తి, బెల్లం వేణు తదితరులతో కలిసి పలువురికి భోజనం వడ్డించి, క్యాంటీన్ నిర్వాహకుడు రంజిత్ ను అభినందించారు. పుట్టిన రోజులు, ప్రత్యేక సందర్భాల్లో దాతలు అందించే సాయంతో ఉచితంగా భోజనం వడ్డిస్తున్నట్లు రంజిత్ తెలిపారు.

# పోటు మరణం జిల్లా రాజకీయాలకు తీరని లోటు

**ఖమ్మం , నవంబర్ 28, మహా:** సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ మరణం ఖమ్మం జిల్లా రాజకీయాలకు ప్రత్యేకించి ప్రగతిశీల రాజకీయాలకు తీరని లోటని మాజీ మంత్రి పువ్వాడ అజయ్కుమార్ అన్నారు. గురువారం మమత ఆసుపత్రిలో అజయ్ కుమార్ సతీమణి వసంతలక్ష్మితో కలిసి పోటు



ప్రసాద్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటు ప్రసాద్ అభ్యుదయ భావాలతో ఖమ్మం జిల్లా రాజకీయాలలో ఒక చెరగని ముద్ర వేశారని, నిస్వార్థంతో జీవిత కాలం రాజకీయాలు నడిపిన ఆయన సమకాలిన రాజకీయాల్లో ఆదర్శవంతుడన్నారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కమ్యూనిస్టు శ్రేణులు ప్రసాద్ మరణం తర్వాత మనో ధైర్యంతో ముందుకు సాగాలన్నారు. పువ్వాడ అజయ్కుమార్ వెంట సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్ కె జానిమియా, పోటు ప్రసాద్ సోదరి పోటు కళావతి, పలువురు కుటుంబ సభ్యులు ఉన్నారు.

# కార్మికుల సమస్యలపై సమావేశం

**కొత్తగూడెం, నవంబరు 28, మహా:** సింగరేణి కార్మికుల పలు సమస్యలపై విషయమై గురువారం కొత్తగూడెం ఇల్లెందు క్లబ్ లో సమావేశం నిర్వహించారు. డైరెక్టర్ వెంకటేశ్వర రెడ్డి అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు వి.సీతారామయ్య, జనరల్ సెక్రెటరీ కె. రాజ్ కుమార్ తోపాటు పలువురు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్మికుల సమస్యలపై పరిష్కార విషయమై చర్చించారు. యజమాన్యం తరపున జీఎం(పర్సనల్) కవితా నాయుడు, జీఎం(ఐఈ) టి. సురేష్ బాబు, జీఎం(ఫైనాన్స్) ఎం.సుబ్బా రావు, జీఎం(యూజీ మైన్స్) వై. రఘు రామి రెడ్డి, జీఎం(ప ర్సనల్)శ్రీనివాస రావు, ఏసీఎంఓ ఎం.ఉష, డీజీఎం(పర్సనల్) ఐఆర్ వింగ్ అజయ్ కుమార్, కేంద్ర ఉపాధ్యక్షులు వంగ వెంకట్, ఉప ప్రధాన కార్యదర్శులు కే.సారయ్య, ఇతర ఉన్నత అధికారులు, తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.



# హామీలు అమలు చేయాలి

**చర్ల, నవంబర్ 28, మహా:** మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు పదివేల రూపాయలు వేతనం ఇస్తామని ఎన్నికల ముందు వాగ్దానం చేశారని, ప్రభుత్వం ఏర్పాటు చేసి ఏడాది కావస్తున్నప్పటికీ మధ్యాహ్న భోజనం పథకం కార్మికులకు ఒక్క రూపాయి కూడా వేతనాలు పెంచలేదని, తక్షణమే వేతనాలు పెంచాలని సీఐటీయూ ఆధ్వర్యంలో చర్ల ఎంఈఓ కార్యాలయం ముందు గురువారం ధర్నా నిర్వహించారు. ధర్నాకు సంఘీభావం తెలిపిన తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా నాయకులు కారం నరేష్, సీఐటీయూ మండల నాయకులు పి బాలాజీ, నిరోషా, సమ్మక్క మాట్లాడుతూ.. తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు ప్రభుత్వం వెంటనే జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. కోడిగుడ్డుకి అదనపు బడ్జెట్ కేటాయించాలని, లేదంటే కోడిగుడ్లు ప్రభుత్వమే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక వర్కర్ కి రెండు జతల కాటన్ యూనిఫామ్ దుస్తులు ఇవ్వాలన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్ ఛార్జీలు పెంచాలని, వంటగ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ లో ఉన్న బిల్లులు మొత్తం చెల్లించాలని, బకాయి వేతనాలు చెల్లించాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం డిసెంబర్ మూడో తేదీన చలో పార్లమెంట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ధర్నా కార్యక్రమంలో తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ సీఐటీయూ నాయకులు, రాణి ,వెంకటమ్మ మీడియం రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.





# 80 వేల పైకి సెన్సెక్స్

## మళ్లీ లాభాల్లోకి స్టాక్ మార్కెట్లు

**ముంబై, నవంబర్ 27 :** దేశీయ స్టాక్ మార్కెట్లు మళ్లీ లాభాల్లోకి వచ్చాయి. గత కొన్నిరోజులుగా భారీగా నష్టపోయిన అదానీ గ్రూపు షేర్లు తిరిగి లాభాల్లోకి రావడం, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారీగా నిధులు కుమ్మరించడంతో సూచీలు తిరిగి లాభాల్లోకి రాగలిగాయి. ఇంట్రాడేలో 500 పాయింట్లకు పైగా పెరిగిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు మార్కెట్ ముగిసే సమయానికి 230.02 పాయింట్లు అందుకొని తిరిగి 80 వేల పైకి 80,234.08కు చేరుకున్నది. మరో సూచీ నిఫ్టీ సైతం 80.40 పాయింట్లు అందుకొని 24,274.90 వద్ద నిలిచింది. 24,354 గరిష్ఠ స్థాయి నుంచి 24,145 కనిష్ఠ స్థాయిలో కదలాడిన నిఫ్టీ చివరకు 80 పాయింట్లకు పైగా లాభపడింది. మధ్యాహ్నం వరకు తీవ్ర ఊగిసలాటలో కదలాడిన సూచీలకు ఆ తర్వాత అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలు జోష్ పెంచాయి. ఫలితంగా భారీ లాభాలవైపు కదంతొక్కాయి.

# తెలంగాణతో దోస్తీకి బల్గేరియా ఆసక్తి

**హైదరాబాద్, మహా :** తెలంగాణతో వాణిజ్య, సాంస్కృతిక రంగాల్లో ద్వైపాక్షిక సంబంధాలు నెలకొల్పేందుకు బల్గేరియా ఆసక్తితో ఉన్నదని భారత్‌లో ఆ దేశ రాయబారి డా.నికోలాయ్ యాంకోవ్ వెల్లడించారు. బుధవారం ఆయన సచివాలయంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఇరు దేశాల మధ్య వాణిజ్య, పారిశ్రామిక పెట్టుబడులకు సంబంధించి ఒక కామన్ ప్లాట్‌ఫామ్ ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనను మంత్రి అంగీకరించారు. నూతన ఆవిష్కరణలు, ఫార్మా, లైఫ్‌సైన్సెస్‌లో తమ రాష్ట్రంలో అద్భుతమైన ఎకోసిస్టమ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామని శ్రీధర్ బాబు ఆయనకు వివరించారు. త్వరలో ఇరు దేశాల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసి చర్చలు జరిపాలని శ్రీధర్ బాబు చేసిన ప్రతిపాదనకు నికోలాయ్ సంసిద్ధత వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి ఆ దేశపు గౌరవ కాన్సులేట్, సుచిర్ ఇండియా ఇన్‌ఫ్రా సీఈవో డా.కిరణ్ కుమార్ కూడా హాజరయ్యారు.



# ఒత్తిడిలో పౌల్ట్రీ పరిశ్రమ..

# కేంద్ర ప్రభుత్వం చేయూతనివ్వాలి

## పౌల్ట్రీ ఇండియా అధ్యక్షుడు




**మాదాపూర్, మహా:** దేశ ఆహార భద్రత, గ్రామీణ ఉపాధికి కీలకంగా ఉన్న పౌల్ట్రీ పరిశ్రమ ప్రస్తుతం తీవ్ర ఒత్తిడిలో ఉన్నదని పౌల్ట్రీ ఇండియా అధ్యక్షుడు ఉదయ్ సింగ్ అన్నారు. హైదరాబాద్‌లోని మాదాపూర్‌లోగల హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో పౌల్ట్రీ ఇండియా ఎగ్జిబిషన్ 16వ ఎడిషన్‌ను ఐపీఈఎంఏతో కలిసి నిర్వహిస్తున్నారు. మూడు రోజుల ఈ ఎగ్జిబిషన్ బుధవారం మొదలైంది. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఉదయ్ సింగ్ మాట్లాడుతూ.. ఏటా దేశ జీడీపీకి రూ.1.35 లక్షల కోట్ల సహకారాన్ని పౌల్ట్రీ ఇండస్ట్రీ అందిస్తున్నదన్నారు. లక్షలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాల్ని కల్పిస్తున్నదని, అలాంటి ఈ పరిశ్రమ.. ముడిసరుకు వ్యయాలు పెరగడం వల్ల కుదేలవుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. మొక్కజొన్న, సోయా వంటి దాణా ఉత్పత్తులతోపాటు పౌల్ట్రీ ఇండస్ట్రీ పరికరాలపై జీఎస్టీ భారం పెరిగిపోయిందని, దీన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. రుణ లభ్యతనూ పెంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. అలాగే వ్యాక్సిన్ దిగుమతులకు సత్వర అనుమతులివ్వాలన్న ఆయన.. పిల్లల్లో పోషకాహార లోపం సమస్యను అధిగమించడానికి దేశవ్యాప్తంగా పాఠశాలల భోజన కార్యక్రమాలలో గుడ్డును చేర్చాలనీ కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారందాకా కొనసాగనున్న ఈ ఎక్స్‌పోకు 40 వేలకుపైగా సందర్శకులు వస్తారని నిర్వాహకుల అంచనా.




# 4 లక్షల కోట్లు

## అప్పులతో టెలికం కంపెనీల సతమతం

**న్యూఢిల్లీ, నవంబర్ 27:** దేశీయ టెలికం సంస్థలు రుణాలతో సతమతమవుతున్నాయి. 202324 ఆర్థిక సంవత్సరం చివరినాటికి నాలుగు టెలికం సంస్థల అప్పు రూ.4,09,905 కోట్లుగా ఉన్నట్లు పార్లమెంట్‌కు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. లోకసభలో సభ్యుడు అడిగిన ప్రశ్నకు కేంద్ర కమ్యూనికేషన్ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. వొడాఫోన్ ఐడియా అత్యధికంగా రూ.2.07 లక్షల కోట్లు రుణం ఉండగా, భారతీ ఎయిర్‌టెల్ రూ.1.25 లక్షల కోట్లు, జియోకు రూ.52,740 కోట్లు, బీఎస్ఎన్ఎల్ అప్పు రూ.28,092 కోట్లుగా ఉన్నట్లు చెప్పారు. 202122లో బీఎస్ఎన్ఎల్‌కు రూ.40,400 కోట్ల రుణం ఉండగా, కేంద్ర ప్రభుత్వం పలుదఫాలుగా ప్రకటించిన పునరుద్ధరణ ప్యాకేజీతో కంపెనీ రుణం రూ.28,092 కోట్లకు తగ్గినట్లు మంత్రి చెప్పారు. అలాగే బీఎస్ఎన్ఎల్‌కి 4జీ/5జీ స్పెక్ట్రం కేటాయించడానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు.


# ఎట్టకేలకు మార్కెట్లోకి యాక్టివా ఈ-స్కూటర్..

## జనవరి 1 నుంచి బుకింగ్స్




**బెంగళూరు, నవంబర్ 27 :** ఎట్టకేలకు యాక్టివా ఈస్కూటర్ మార్కెట్లోకి అందుబాటులోకి రాబోతున్నది. దేశవ్యాప్తంగా ఈస్కూటర్లకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని హోండా మోటర్‌సైకిల్ గతంలోనే యాక్టివాను ఈస్కూటర్ రూపంలో విడుదల చేయబోతున్నట్లు ప్రకటించింది. జనవరి 1 నుంచి ఈస్కూటర్ కోసం బుకింగ్‌లు ఆరంభించనున్న సంస్థ..ఫిబ్రవరి నుంచి డెలివరీ చేయనున్నట్లు ప్రకటించింది. ఇందుకు సంబంధించి బెంగళూరు వేదికగా రెండు రకాలుగా ఈస్కూటర్లను ప్రదర్శించింది. యాక్టివా ఈ, క్యూసీ 1 పేర్లలో వీటిని విడుదల చేసింది. ధర వివరాలు మాత్రం సంస్థ వెల్లడించలేదు.

# దేశం-విదేశం | NATIONAL NEWS




# ఢిల్లీలో భారీ పేలుడు..


## భయాందోళనలో స్థానికులు

దేశ రాజధాని ఢిల్లీలో భారీ పేలుడు సంభవించింది. ప్రశాంత్ విహార్ ప్రాంతంలోని పీవీఆర్ మల్టీప్లెక్స్ సమీపంలో గల ఓ స్వీట్ షాప్‌లో గురువారం ఈ ఘటన చోటు చేసుకుంది. పేలుడు ధాటికి చుట్టుపక్కల ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. గురువారం ఉదయం 11:48 గంటల సమయంలో స్వీట్ షాప్ వద్ద పేలుడు సంభవించినట్లు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందింది. సమాచారం అందగానే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకున్నారు. ఈ మేరకు ఆ ప్రాంతంలో తనిఖీలు చేపట్టారు. ప్రమాద స్థలిలో తెల్లటి పొడి లాంటి పదార్థం దొరికినట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడించారు.

# 16 ఏండ్లలోపు వారికి సోషల్ మీడియా నిషేధం..

## బిల్లును ఆమోదించిన ఆస్ట్రేలియా ప్రతినిధుల సభ

ఆస్ట్రేలియా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 16 ఏండ్ల లోపు పిల్లలు సామాజిక మాధ్యమాలు వినియోగించకుండా నిషేధాన్ని విధిస్తూ కొత్త చట్టాన్ని తీసుకొచ్చింది. ఆ బిల్లుకు ఆస్ట్రేలియా ప్రతినిధుల సభ ఇవాళ ఆమోద ముద్ర వేసింది. బిల్లును బుధవారం సభలో ప్రవేశపెట్టగా 102 మంది సభ్యులు అనుకూలంగా ఓటేశారు. మెజారిటీ పార్టీలన్నీ బిల్లుకు అనుకూలంగా ఓటెయ్యగా, 13 మంది సభ్యులు మాత్రం వ్యతిరేకించారు. ఇక సెనేట్‌లో ఆమోదం లభించిన వెంటనే బిల్లు చట్టరూపం దాల్చనుంది. ఆ వెంటనే సామాజిక మాధ్యమాలకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయనుంది. 16 ఏండ్ల లోపు పిల్లల సామాజిక మాధ్యమ ఖాతాలను నిరోధించడంలో వ్యవస్థాగతంగా విఫలమైతే సామాజిక మాధ్యమాలకు 50 మిలియన్ ఆస్ట్రేలియన్ డాలర్ల వరకు జరిమానా విధిస్తామని ప్రభుత్వం హెచ్చరించారు. అంటే మన భారత కరెన్సీ ప్రకారం రూ.273 కోట్లకు పైమాటే. ఫేస్‌బుక్, ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్, టిక్‌టాక్, స్నాప్‌చాట్, రెడిట్ తదితర మాధ్యమాలకు ఈ చట్టం వర్తించనుంది. కాగా, బిల్లు చట్ట రూపం దాల్చితే సోషల్ మీడియాపై నిషేధం విధించిన తొలి దేశంగా ఆస్ట్రేలియా రికార్డుకెక్కనుంది.






# చెత్తబుట్టలో హార్డ్‌డ్రైవ్..

## అందులో 5,900 కోట్లు..

**న్యూఢిల్లీ :** యూకేలో ఓ మహిళ తన మాజీ భాగస్వామి హార్డ్‌డ్రైవ్‌ను చెత్తబుట్టలో పడేసింది. అందులో అప్పటికే 8 వేల బిట్‌కాయిన్లు ఉన్నాయి. ఇప్పుడు వాటి విలువ 569 మిలియన్ పౌండ్లు. (దాదాపు రూ.5,900 కోట్లు). ఇప్పుడా హార్డ్‌డ్రైవ్ వేల్స్‌లోని న్యూపోర్ట్‌లో లక్ష టన్నుల చెత్త కింద ఉండొచ్చని భావిస్తున్నారు. అతడు తనకో చెత్త బ్యాగును ఇచ్చి బయటపడేయాలని చెప్తే తీసుకెళ్లి పడేశానని, నిజానికి అందులో ఏముందో తనకు తెలియదని జేమ్స్ హౌల్స్ మాజీ గాళ్‌ఫ్రెండ్ అయిన హాల్ఫినా ఎడ్డీ ఇవాన్స్ వివరించింది. దానిని కోల్పోవడం తన తప్పు కాదని పేర్కొంది. అతడు దానిని కనుగొనాలని ఆశిస్తున్నానని, అందులోంచి తనకు ఒక్క రూపాయి కూడా అక్కర్లేదని జేమ్స్ హౌల్స్‌ను ఉద్దేశించి పేర్కొంది. అయితే, అతడు దీని గురించి మాట్లాడడం ఆపేయాలని కోరుకుంటున్నానని, అది మానసిక ఆరోగ్యానికి అంతమంచిది కాదని తెలిపింది. మరోవైపు, లక్ష టన్నుల చెత్తకింద ఉన్న డబ్బు (హార్డ్‌డిస్క్) కోసం హౌల్స్ ప్రయత్నాలు ప్రారంభించాడు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆ చెత్త కింద ఉన్న డబ్బును సొంతం చేసుకుంటానని చెప్పుకొచ్చాడు.

# సెల్ఫ్ డ్రైవింగ్ శాటిలైట్లు!

**బీజింగ్, నవంబర్ 27:** అంతరిక్ష సాంకేతికతలో చైనా మరో ముందడుగు వేసింది. ప్రపంచంలోనే మొదటిసారిగా సివేయ్ జాయోజింగ్-2 03, జాయోజింగ్-2 04 అనే రెండు సెల్ఫ్ డ్రైవ్ ఉపగ్రహాలను రోదసిలోకి పంపించింది. చైనా ఏరోస్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ కార్పొరేషన్(సీఏఎస్‌సీ) అనుబంధ సంస్థ అయిన షాంఘై అకాడమీ ఆఫ్ స్పైస్‌ఫ్లైట్ టెక్నాలజీ(ఎస్ఏఎస్‌టీ) ఈ ఉపగ్రహాలను అభివృద్ధి చేసింది. జియుక్వాన్ ఉపగ్రహ ప్రయోగ కేంద్రం నుంచి సోమవారం లాంగ్ మార్క్-2సీ రాకెట్ ద్వారా వీటిని ప్రయోగించారు.

## వాటికవే ప్రయాణించేలా అభివృద్ధి

భూమి నుంచి ఎలాంటి జోక్యం లేకుండా వాటికవే మార్గాన్ని నిర్దేశించుకొని ప్రయాణించేలా, మార్గాన్ని మార్చుకునేలా వీటిని తయారుచేశారు. ఈ ఉపగ్రహాలు సర్వే, మ్యాపింగ్ కోసం పని చేయనున్నాయి. నిర్దేశించిన పని పూర్తి చేసిన తర్వాత అత్యంత కచ్చితత్వంతో వాటికవే తిరిగి వాటి కక్ష్యలోకి వస్తాయి. సాధారణ ఆప్టికల్ ఉపగ్రహాలు ఇన్‌ఫ్రారెడ్ లైట్‌పై ఆధారపడి పని చేస్తాయి. ఈ ఉపగ్రహాలు మాత్రం మైక్రోవేవ్ సిగ్నళ్ల ద్వారా పని చేస్తాయి. దీంతో ఇవి మేఘాలు, పొగమంచు ఉన్నప్పుడూ సర్వే, మ్యాపింగ్ కోసం పని చేయగలవు. రాత్రిపగలు, వాతావరణంతో సంబంధం లేకుండా హై రిజల్యూషన్ ఫొటోలను తీయగలవు. ఉపగ్రహాల ద్వారా సర్వే, మ్యాపింగ్ చేసే సాంకేతికతలో ఇది విప్లవాత్మకంగా మారొచ్చని చైనా శాస్త్రవేత్తలు భావిస్తున్నారు.



# అరెస్ట్ వారెంట్‌ను రద్దు చేయండి..

## ఐసీసీని ఆశ్రయించిన ఇజ్రాయెల్

**మహా, బిజినెస్:** ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహూపై ఇంటర్నేషనల్ క్రిమినల్ కోర్టు అరెస్టు వారెంట్ జారీ చేసిన విషయం తెలిసిందే. ఆయనతో పాటు ఇజ్రాయెల్ మాజీ రక్షణ శాఖ మంత్రి యోవ్ గల్లెంట్, హమాస్ అధికారులపైనా ఈ వారెంట్లు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఆ అరెస్టు వారెంట్‌ను రద్దు చేయాలని కోరుతూ ఇజ్రాయెల్ ఐసీసీని ఆశ్రయించింది. ఈ మేరకు న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేసింది. ఈ విషయాన్ని ఇజ్రాయెల్ ప్రధాని కార్యాలయం ఓ ప్రకటనలో వెల్లడించింది.

గాజాలో చేస్తున్న యుద్ధంలో యుద్ధనేరాలకు, మానవతా వ్యతిరేక నేరాలకు పాల్పడ్డారనే ఆరోపణలతో నెతన్యాహూ, గల్లెంట్‌పై, 2023 అక్టోబరులో ఇజ్రాయెల్‌పై దాడికి పాల్పడినందున హమాస్ అధికారులపై ముగ్గురు సభ్యుల ధర్మాసనం అరెస్టు వారెంట్లు జారీ చేసింది. హత్య, హింస, అమానవీయ చర్యలు, మానవత్వానికి వ్యతిరేకంగా నేరాలకు వారు పాల్పడినట్లు ఆరోపించింది. గాజాపై దాడులతోపాటు పౌరులకు ఆహారం, నీరు, వైద్య సహాయం వంటివి అందకుండా చేశారని ఆరోపించింది. పిల్లలతో సహా మరణాలు, తీవ్రమైన మానవ సంక్షోభానికి ఇది దారితీసినట్లు పేర్కొంది.

గతేడాది అక్టోబర్ 7న గాజాపై పట్టున్న హమాస్ ఇజ్రాయెల్‌పై మెరుపుదాడులు చేసింది. వందలాది మంది ఇజ్రాయెల్ పౌరులను చంపడంతోపాటు పలువురిని బంధించి గాజాకు తరలించారు. దీనికి ప్రతీకారంగా ఇజ్రాయెల్ ఆర్మీ గాజాపై దాడులు చేసింది. మహిళలు, పిల్లలతో సహా వేలాది మంది మరణించారు. వైమానిక దాడుల్లో ఆసుపత్రులు, స్కూళ్లు వంటివి నేలమట్టమయ్యాయి.





# ఛాంపియన్స్ ట్రోఫీకి హైబ్రిడ్ మోడల్‌ను ఆమోదించం

## : పాకిస్థాన్ క్రికెట్ బోర్డు

**కరాచీ:** పాకిస్థాన్‌లో జరగబోయే ఛాంపియన్స్ ట్రోఫీపై వివాదం రాజుకుంటూనే ఉన్నది. ఆ టోర్నీ కోసం హైబ్రిడ్ మోడల్(Hybrid Model)ను వినియోగిస్తే, దాన్ని ఆమోదించబోమని ఇవాళ పాకిస్థాన్ క్రికెట్ బోర్డు తేల్చి చెప్పింది. అంతర్జాతీయ క్రికెట్ మండలికి ఈ విషయాన్ని చేరవేసింది. శుక్రవారం జరిగే ఐసీసీ బోర్డు వర్చువల్ మీటింగ్‌లో ఈ అంశమే కీలకం కానున్నది. పాకిస్థాన్‌లో ఆడేందుకు భారత్ విముఖంగా ఉన్న నేపథ్యంలో.. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు హైబ్రిడ్ మోడల్‌ను వ్యతిరేకిస్తున్నది. తటస్థ వేదికపై భారత్‌తో తలపడేందుకు పాకిస్థాన్ ఇష్టంగా లేదు. దీంతో ఆ టోర్నీ జరుగుతుందా లేదా అన్న సందిగ్ధత ఏర్పడింది.

హైబ్రిడ్ మోడల్‌ను ఆమోదించడం అంటే, ఇండియాకు ప్రిఫరెన్స్ ఇచ్చినట్లే అవుతుందని పాకిస్థాన్ బోర్డు వాదిస్తున్నది. ఒకవేళ హైబ్రిడ్ మోడల్‌కు అవకాశం ఇస్తే, అప్పుడు భవిష్యత్తులో ఐసీసీ అన్ని హైబ్రిడ్ మోడల్‌లో మ్యాచ్‌లు నిర్వహించే అవకాశాలు ఉన్నట్లు పాకిస్థాన్ అనుమానం వ్యక్తం చేసింది. 2031లో భారత్, బంగ్లాదేశ్ కలిసి వన్డే వరల్డ్‌కప్ నిర్వహించే వరకు ఆ దేశానికి వెళ్లే పరిస్థితి ఉండదని పాక్ బోర్డు తెలిపింది. పాకిస్థాన్‌లో ఆడకూడదన్న విషయంపై భారత ప్రభుత్వం బీసీసీఐకి ఏదైనా లేఖ సమర్పించిందా అని కూడా పీసీబీ అడిగింది. ఐసీసీ ఆదాయ మార్గాల్లో బీసీసీఐ పాత్రను విస్మరించలేమని, కానీ ఇటీవల భారత్‌తో ఆడిన మ్యాచ్‌ల ద్వారా ఆదాయాన్ని ఆర్జించినట్లు పాకిస్థాన్ బోర్డు తెలిపింది.



ముంబై: భారత పేసర్ మహమ్మద్ షమీ.. చాలా గ్యాప్ తర్వాత మళ్లీ బాల్ పట్టాడు. గాయం నుంచి కోలుకున్న షమీ ఇటీవల బెంగాల్ తరపున రంజీ మ్యాచ్‌లో ఆడాడు. ఆ మ్యాచ్‌లో అతను మెరుగ్గానే బౌలింగ్ చేశాడు. ప్రస్తుతం జరుగుతున్న సయ్యద్ ముస్తాక్ అలీ టోర్నీలో కూడా ఆడుతున్నాడు. షమీ పర్ఫార్మెన్స్ బాగానే ఉన్నా.. బీసీసీఐ మాత్రం అతనికి కొన్ని కండీషన్స్ పెట్టింది. షమీ బౌలింగ్‌ను ఎప్పటికప్పుడు బీసీసీఐ మెడికల్ టీమ్ పర్యవేక్షిస్తున్నది. ఎక్కువ కాలం బ్రేక్ తీసుకోవడం వల్ల షమీ.. చాలా వెయిట్ పెరిగినట్లు తెలుస్తోంది. కాబట్టి అతను ముందుగా బరువు తగ్గాల్సి ఉంటుంది. దీంతో పాటు అతను తన ఫిట్‌నెస్‌ను ఇంప్రూవ్ చేయాల్సి ఉందన్న అభిప్రాయాలను బీసీసీఐ

# షమీ టీమిండియాతో ఎప్పుడు కలుస్తాడు?..


## బీసీసీఐ విధించిన డెడ్‌లైన్ ఏంటంటే?

వ్యక్తం చేసింది. ప్రస్తుతం భారత జట్టు ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న విషయం తెలిసిందే. తొలి టెస్టును ఈజీగా నెగ్గింది టీమిండియా. అయితే రెండో టెస్టుకు షమీని రప్పిస్తారా అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కానీ బీసీసీఐ మెడికల్ బృందం మాత్రం ఆ తొందర ప్రదర్శించడం లేదు. రోహిత్ సేనతో షమీ కలవాలంటే మరింత సమయం పట్టే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. మ్యాచ్‌లు ఆడుతున్నా కొద్దీ.. షమీ తన బరువును కోల్పోయే అవకాశాలు ఉన్నట్లు మెడికల్ టీం అంచనా వేస్తున్నది. బీసీసీఐ స్పోర్ట్స్ సైన్స్ డాక్టర్ నితిన్ పటేల్, నేషనల్ క్రికెట్ అకాడమీ శిక్షకుడు నిశాంత్ బోర్డోలాయ్ .. ప్రస్తుతం షమీ ట్రైనింగ్, రికవరీని పర్యవేక్షిస్తున్నారు. ఇక ఫిబ్రవరిలో ఛాంపియన్స్ ట్రోఫీ ఉన్న నేపథ్యంలో.. షమీని అత్యవసరంగా ఆస్ట్రేలియాకు పంపాల్సిన అవసరం లేదన్న ఆలోచనలో బీసీసీఐ ఉన్నది. అయితే సయ్యద్ ముస్తాక్ అలీ టోర్నీలో బౌలర్ కేవలం రెండు ఓవర్లు మాత్రమే వేసే అవకాశం ఉంటుందని, దాని ఆధారంగా షమీ ఫిట్‌నెస్‌ను పూర్తిగా అంచనా వేయలేమని బీసీసీఐ వర్గాలు చెబుతున్నాయి. ఒకవేళ ప్లాన్ ప్రకారం షమీ రికవరీ అయితే, అతను డిసెంబర్ 14వ తేదీన ఆస్ట్రేలియాతో ప్రారంభం అయ్యే మూడవ టెస్టుకు అందుబాటులోకి వచ్చే అవకాశాలు ఉన్నట్లు భావిస్తున్నారు.

# బీజేపీలో చేరితే నిషేధం ఖతం

## :బజ్‌రంగ్ పునియా

**ఢిల్లీ:** డోప్ పరీక్షలకు నమూనాలు ఇవ్వలేదనే కారణంతో నాలుగేండ్ల నిషేధానికి గురైన రెజ్లర్ బజ్‌రంగ్ పునియా ఈ వివాదంపై స్పందిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఒకవేళ తాను గనక బీజేపీలో చేరితే తనపై ఉన్న నిషేధాలన్నింటినీ ఎత్తివేస్తారని పునియా అన్నాడు. బజ్‌రంగ్ మాట్లాడుతూ.. 'నాడా నిషేధం నన్నేమీ ఆశ్చర్యానికి గురి చేయలేదు.దీనిపై నేను గతంలోనే వెల్లడించాను. నాడా అధికారులు శాంపిల్స్ కోసం వచ్చినప్పుడు గడువు ముగిసిన కిట్లతో వచ్చారు.దీనిపై సోషల్ మీడియాలో పోస్ట్ చేశాను. ఒకవేళ నేను బీజేపీలో చేరితే ఈ నిషేధాలన్నింటినీ ఎత్తేస్తారు' అని తెలిపాడు.





# టీపీజీఎల్ ఫైనల్లో ఈగల్స్, వారియర్స్

**హైదరాబాద్, స్పోర్ట్స్:** తెలంగాణ ప్రీమియర్ గోల్ఫ్ లీగ్ (టీపీజీఎల్)లో ఫైనల్ బెర్తులు ఖరారయ్యాయి. లీగ్‌లో గోల్డెన్ ఈగల్స్, వ్యాలీ వారియర్స్ ఫైనల్లోకి దూసుకెళ్లాయి. బుధవారం జరిగిన వేర్వేరు సెమీస్‌లో గోల్డెన్ ఈగల్స్ 3.52.5తో టీమ్ టీఆఫ్ ఫెయిర్‌మౌంట్‌పై విజయం సాధించింది. మరో సెమీస్‌లో వ్యాలీ వారియర్స్ 42తో రిట్జ్ మాస్టర్స్‌పై గెలిచింది.



# భారత క్రికెట్ జట్టుకు ఆస్ట్రేలియా ప్రధాని విందు

**మహా, మెల్‌బోర్న్:** భారత క్రికెట్ జట్టు ఆస్ట్రేలియాలో పర్యటిస్తున్న విషయం తెలిసిందే. అయితే ఇవాళ ఆ దేశ రాజధాని క్యాన్‌బెరాలో.. ప్రధాని ఆంథోనీ ఆల్బనీస్.. భారత క్రికెట్ బృందానికి విందు ఇచ్చారు. ఈ నేపథ్యంలో రోహిత్ సేన నేతృత్వంలోని భారత బృందం ప్రధాని ఆల్బనీస్‌ను కలిసింది. జట్టు సభ్యులను కెప్టెన్ రోహిత్ శర్మ .. ఆస్ట్రేలియా ప్రధాని ఆల్బనీస్‌కు పరిచయం చేశారు. పెర్త్ టెస్టులో విజయం సాధించిన భారత క్రికెటర్లను ప్రశంసించారు. బుమ్రా, కోహ్లీని ప్రత్యేకంగా మెచ్చుకున్నారు. మరోవైపు నవంబర్ 30వ తేదీ నుంచి ప్రైమ్ మినిస్టర్ లెవన్ జట్టుతో ఇండియా రెండు రోజుల పింక్ బాల్ ప్రాక్టీసు మ్యాచ్ ఆడనున్నది. మనూకా ఓవల్ మైదానంలో ఆ మ్యాచ్ జరగనున్నది. డిసెంబర్ 6వ తేదీ నుంచి ప్రారంభంకానున్న రెండవ టెస్టుకు.. ప్రాక్టీస్ మ్యాచ్ దోహదపడనున్నది. జాక్ ఎడ్వర్డ్స్ నేతృత్వంలోని ప్రైమ్ మినిస్టర్స్ లెవన్ జట్టు కూడా ప్రధాని ఆల్బనీస్‌ను కలిసింది.



# సినిమా వార్తలు | MOVIE NEWS



# రాంచరణ్-బుచ్చి బాబు ఆర్‌సీ 16 చిత్రీకరణ జరుగుతున్న ప్లేస్ ఇదే..!



టాలీవుడ్ స్టార్ హీరో రాంచరణ్ వరుస సినిమాలను లైన్‌లో పెట్టాడని తెలిసిందే. వీటిలో ఒకటి గేమ్ ఛేంజర్. ఈ మూవీ జనవరి 10న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. కాగా గేమ్ ఛేంజర్ థియేటర్లలోకి రాక ముందే ఉప్పెన ఫేం బుచ్చి బాబు సాన డైరెక్షన్‌లో ఆర్‌సీ 16కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేయడమే కాదు.. షూటింగ్‌తో కూడా బిజీ అయిపోయాడు. ఇటీవలే మైసూరులోని ఛాముండేశ్వరి మాత ఆశీస్సులతో సినిమా షూటింగ్‌ను మొదలుపెడుతున్నట్టు తెలియజేస్తూ డైరెక్టర్ బుచ్చి బాబు ఫొటో కూడా షేర్ చేసుకున్నాడు. రాంచరణ్ కూడా ఈ షెడ్యూల్‌లో పాల్గొనేందుకు మైసూర్‌లో ఇప్పటికే ల్యాండ్ అయ్యాడు. అయితే ఆర్‌సీ 16 చిత్రీకరణ ప్రస్తుతం ఎక్కడ జరుగుతుందనేది తెలియజేస్తూ నెట్టింట కొన్ని ఫొటోలు హల్ చల్ చేస్తున్నాయి. ప్రస్తుతం శ్రీరంగపట్టణ బెల్లం ఫ్యాక్టరీ, మైసూరుకు సమీపంలోని మేల్కొటే టెంపుల్‌లో షూటింగ్ కొనసాగుతోంది. స్పోర్ట్స్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో బాలీవుడ్ భామ జాన్వీకపూర్ హీరోయిన్‌గా నటిస్తోంది. తంగలాన్ ఫేం ఏగన్ ఏకాంబరం ఈ మూవీకి కాస్ట్యూమ్ డిజైనర్ పనిచేస్తున్నాడు. ఈ చిత్రాన్ని సుకుమార్ రైటింగ్స్‌మైత్రీ మూవీ మేకర్స్ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నాయి. ఏఆర్ రెహమాన్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, మ్యూజిక్ అందిస్తున్నాడు.



**గోవా ఫిలిం ఫెస్టివల్‌లో సందడి చేసిన M4M హీరోయిన్ జో శర్మ**

# నువ్వేంట్రా ఇలా యెధవలా తయారయ్యావ్..

## అల్లరి నరేశ్ బచ్చలమల్లి టీజర్

అల్లరి నరేశ్ టైటిల్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం బచ్చలమల్లి. సుబ్బు మంగాదేవి దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీ రూరల్ యాక్షన్ డ్రామా నేపథ్యంలో వస్తోంది. క్రిస్మస్ కానుకగా డిసెంబర్ 20న థియేటర్లలో సందడి చేయనుంది. ప్రమోషన్స్‌లో భాగంగా టీజర్ విడుదల చేశారు మేకర్స్. కావేరి నీతో మాట్లాడాలి.. నాకు సిగరెట్ అలవాటుంది.. మందు అలవాటుంది.. అప్పుడప్పుడు అమ్మాయిల అలవాటు కూడా ఉంది.. అల్లరి నరేశ్ హీరోయిన్‌కు చెప్పే డైలాగ్స్‌తో షురూ అయింది టీజర్. మీ నాన్నేదో నిన్ను గొప్పోడిని చేయాలనుకుంటే నువ్వేంట్రా ఇలా యెధవలా తయారయ్యావంటున్నాడు రావు రమేశ్. నేను ఎవ్వరి కోసం మారను. నాకు నచ్చినట్టు బతుకుతా అంటూ సాగుతున్న సీన్లు బచ్చలమల్లి క్యారెక్టర్ ఎలా ఉండబోతుందో చెబుతూ సినిమాపై ఆసక్తిని పెంచుతున్నాయి. ఇప్పటికే అల్లరి నరేశ్ సిగరెట్ తాగుతూ సీరియస్ మూడ్‌లో ఉన్న పోస్టర్ నెట్టింట చక్కర్లు కొడుతోంది. ఈ చిత్రంలో అమృతా అయ్యర్ ఫీమేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది.హాస్యా మూవీస్ బ్యానర్‌పై రాజేశ్ దండా, బాలాజీ గుప్తా సంయుక్తంగా తెరకెక్కిస్తున్న ఈ మూవీకి విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందిస్తున్నాడు.







# నాచారంలో హైపర్ మార్ట్ - వాల్యూ జోన్

## ప్రారంభించిన సినీహీరో బాలకృష్ణ

**మహా,హైదరాబాద్:** హైదరాబాద్ లోని నాచారంలో వాల్యూ జోన్ హైపర్ మార్ట్ ను గురువారం ప్రముఖ సినీ నటుడు నందమూరి బాలకృష్ణ ప్రారంభించారు.ఫ్యాషన్, కిరాణా సరుకులు, ఫుట్ వేర్,లగేజ్, ఫర్నిషింగ్,స్టేషనరీ మరియు సాధారణ వస్తువులతో పాటు ప్రఖ్యాతి గాంచిన ప్రపంచ మరియు భారతీయ బ్రాండ్ లను వినియోగదారులకు అందించేవిధంగా ఒకేచోట రిటైల్ షాపింగ్ అందిస్తున్నారు.పి.వెంకటేశ్వర్లు,ఎస్.రాజమౌళి,టి.ప్రసాదరావు మరియు పి.సత్యనారాయణలు మారుతున్న కాలానికి అనుగుణంగా వినియోగదారులకు రిటైల్ ఫార్మేట్ ను రూపొందించాలనే వారి ఆలోచన నేడు దేశంలోనే అతిపెద్ద హైపర్ మార్ట్‌వాల్యూ జోన్ గా విస్తరించిందని తెలిపారు.హైపర్ మార్ట్ బ్రాండ్ అంబాసిడర్ గా ఉన్న సినీనటుడు బాలకృష్ణ మాట్లాడుతూ... వాల్యూ జోన్ ఖచ్చితంగా గొప్ప రిటైల్ ఫార్మాట్ అన్నారు. వాల్యూ జోన్ లోని కలెక్షన్స్, బ్రాండ్స్ హైదరాబాద్ ప్రజలకోసం సిద్ధంగా ఉన్నాయన్నారు.ఇప్పుడు నాచారంలో వన్ స్టాప్ ఫ్యామిలీ షాప్ వాల్యూ జోన్ హైపర్ మార్ట్ అని అన్నారు.




EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com